RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 2 సంచిక : 352 మేడ్చల్ మల్కాజ్‌గిరి 12 జనవరి 2025 ఆదివారం పేజీలు : 4

## పరువు నష్టం దావాలో రాహుల్‌కు బెయిల్

పుణె : పరువు నష్టం దావాలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీకి ఇక్కడి ఎంపీ/ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టు బెయిల్ మంజూరు చేసింది. కోర్టులో జరిగే విచారణకు వ్యక్తిగతంగా హాజరుకాకుండా కూడా మినహాయింపు ఇచ్చింది. రూ.25,000 పూచీకత్తు చెల్లించాలని ఆదేశించింది. తదుపరి విచారణ ఫిబ్రవరి 18కు వాయిదా పడింది. 2023 మార్చిలో లండన్‌లో జరిగిన కార్యక్రమంలో హిందుత్వ సిద్ధాంతకర్త వి.డి.సావర్కర్‌ను కించపరిచేలా మాట్లాడారంటూ ఆయన మునిమనుమడు రాహుల్‌పై పరువు నష్టం దావా వేశారు.




# 'మహా' కుంభమేళా!

## ప్రపంచ స్థాయిలో నిర్వహణ.. 40 కోట్ల మంది వస్తారని అంచనా

## లక్షా 60 వేలకుపైగా టెంట్లు.. లక్షా 50 వేల టాయిలెట్స్ నిర్మాణం

## 1,250 కిలో మీటర్ల పైపులైన్లు.. 4 వేల హెక్టార్లలో మేళా ఏర్పాట్లు

## ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వం

## 13 నుంచి ప్రారంభం.. మకర సంక్రాంతి రోజు తొలిస్నానం

మహాకుంభ్‌నగర్ : పరమ పవిత్ర గంగ, యమున, సరస్వతి నదుల సంగమ ప్రాంతం ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వద్ద జనవరి 13వ తేదీ నుంచి ప్రారంభమయ్యే మహాకుంభ మేళాకు సీఎం యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం కనీవినీ ఎరుగని ఏర్పాట్లు చేస్తోంది. ప్రపంచస్థాయి మహా పర్వంగా ఈ కుంభమేళాను నిర్వహించేందుకు ముమ్మరంగా ప్రయత్నిస్తోంది.

గత రెండు మాసాలుగా రేయింబవళ్లు కార్మికులు ఇక్కడి పనుల్లో నిమగ్నమయ్యారు. దేశవ్యాప్తంగానే కాకుండా పలు ప్రపంచ దేశాల నుంచి కూడా భక్తులు వస్తారన్న అంచనాలతో ఏర్పాట్లను కూడా అదే స్థాయిలో చేస్తున్నారు. రహదారుల వెడల్పు నుంచి సంగమ ఘాట్ల సుందరీకరణ వరకు అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. మొత్తం ప్రభుత్వ యంత్రాంగమంతా మహా కుంభమేళా నిర్వహణను అత్యంత ప్రతిష్ఠాత్మకం భావిస్తున్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తన 'మన్‌కీ బాత్'లో మహాకుంభ మేళాను.. 'ఐక్యతా మహాకుంభ్'గా అభివర్ణించిన విషయం తెలిసిందే. "ద్వేషం, విభజన వాదాలను పరిత్యజించాలనే ధృఢ సంకల్పంతో ప్రతి ఒక్కరూ ఐక్యతా మహాకుంభ్‌కు తరలి రావాలి" అని మోదీ పిలుపునిచ్చారు. "మహాకుంభ్ సందేశం.. యావత్ దేశాన్నీ ఐక్యంగా ఉంచడమే" అని తేల్చి చెప్పారు. కాగా, మహాకుంభ మేళాకు ప్రస్తుతం ఏర్పాట్లు ఇంకా జరుగుతూనే ఉన్నాయి. ఇప్పటికే దాదాపు అన్ని ఏర్పాట్లు పూర్తయినట్లు మేళా అధికారి విజయ్‌కిరణ్ ఆనంద్ తెలిపారు.

కాగా, ఆక్రమణలు, కోత కారణంగా సంగమం వద్ద గంగా నది 200 నుంచి 500 మీటర్ల వరకు తగ్గిపోయిందని చెప్పారు. ఇదిలావుంటే, 2024 ప్రారంభంలో అయోధ్య రామమందిర ప్రారంభోత్సవానికి చేసిన ఏర్పాట్లను మించి మహాకుంభ మేళాకు ఇప్పుడు ఏర్పాట్లు జరుగుతుండడం గమనార్హం. 2019లో కుంభమేళాకు చేసిన ఏర్పాట్ల కంటే రెట్టింపు ఏర్పాట్లను చేస్తున్నారు.

**హరిత–ఆహ్లాద మేళా! :** మహాకుంభమేళాను హరిత మేళాగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎటు చూసినా పచ్చని చెట్లు, నవ్వులు విరబూసినట్టుగా ఉండే పూల మొక్కలతో సంగమ ప్రాంతాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మొత్తంగా 3 లక్షల మొక్కలను ఇక్కడ నాటుతున్నారు. అదేవిధంగా 12 కిలో మీటర్ల మేర అతిపెద్ద ఘాట్‌ను నిర్మిస్తున్నారు. అదేవిధంగా మేళాకు వచ్చే భక్తుల మనసులు దోచుకునేలా సంగమ ప్రాంతంలోని లక్షా 50 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రామాయణ, మహాభారతాల్లోని పలు అంశాలతో కూడిన కుడ్య చిత్రాలు, తైలవర్ణ చిత్రాలను ఏర్పాటు చేస్తున్నారు. భక్తులకు స్వాగతాలు పలికే చిత్రాలు కూడా మనసును దోచుకునేలా చిత్రీకరిస్తున్నారు.

## రూ. 7.75 లక్షల వరకు నో టాక్స్.. కొత్త పన్ను శ్లాబులతో ఇదే బెనిఫిట్.. మొత్తం లెక్కలివే




భారత్‌లో నిర్దిష్ట ఆదాయం దాటితే పన్ను చెల్లించాలన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం దేశంలో పాత పన్ను విధానం, కొత్త పన్ను విధానం ఉన్నాయి. ఇక కొంత కాలంగా పాత పన్ను విధానంలో అసలు ఎలాంటి మార్పులు చేయట్లేదు కేంద్ర ప్రభుత్వం. త్వరలో దీనిని రద్దు చేస్తుందన్న వాదనలు కూడా వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో కొత్త పన్ను విధానంలో మాత్రం వరుసగా ప్రతి బడ్జెట్‌లోనూ మార్పులు చేస్తూనే ఉంది. 2024 బడ్జెట్ సమయంలో ఇదే విధంగా కొత్త పన్ను విధానం కింద స్టాండర్డ్ డిడక్షన్ పెంచింది. అంతకుముందు రూ. 50 వేలుగా మాత్రమే ఉండగా.. దీనిని రూ. 75 వేలకు పెంచిన సంగతి తెలిసిందే. పాత పన్ను విధానంలో మాత్రం ఇది రూ. 50 వేలుగానే ఉంది. దీంట్లో మార్పులు చేయలేదు. కొత్త పన్ను విధానంలో ఇదొక్కటే కాకుండా ఇంకా పన్ను శ్లాబుల్ని కూడా సవరించింది. వేతన జీవులకు, మధ్య తరగతి వారికి ఊరట కలిగించేలా మరింత సరళీకృతం చేసింది. ముఖ్యంగా రూ. 6 నుంచి 7 లక్షలు, రూ. 9 నుంచి 10 లక్షల వరకు ఆదాయ బ్రాకెట్లలో ఉండే వారికి ప్రయోజనం చేకూర్చనుంది. ఇందులో కీలక మార్పులు చేసింది. కనీస పన్ను మినహాయింపు పరిమితి కొత్త పన్ను విధానంలో రూ. 3 లక్షలుగా ఉంది. అంటే రూ. 3 లక్షల వరకు పన్ను చెల్లించాల్సిన పనిలేదు. ఇక గతంలో రూ. 3–6 లక్షల మధ్య పన్ను 5 శాతంగా ఉండగా.. ఇప్పుడు దీనిని రూ. 3–7 లక్షలకు చేర్చారు. ఇంకా రూ. 6 లక్షలపైన ఆదాయం ఉంటే అది 10 శాతం పన్ను పరిధిలోకి వచ్చేది. 2024 బడ్జెట్‌లో మార్పుల నేపథ్యంలో ఇప్పుడు రూ. 7 లక్షల వరకు కూడా 5 శాతం పరిధిలోకే వస్తుంది. ఇంకా రూ. 7–10 లక్షల ఆదాయంపై ఇప్పుడు 10 శాతం పన్ను రేటు ఉంది. గతంలో రూ. 9–12 లక్షలపై 15 శాతం టాక్స్ ఉండేది. ఇప్పుడు 15 శాతం టాక్స్ రూ. 10–12 లక్షలపై వర్తిస్తుంది. ఇక రూ. 12–15 లక్షల ఆదాయంపై 20 శాతం టాక్స్, రూ. 15 లక్షలపై అయితే 30 శాతం పన్ను పడుతుంది. ఇక కొత్త పన్ను విధానంలో ఇప్పుడు గరిష్టంగా రూ. 7.75 లక్షల వరకు టాక్స్ చెల్లించనక్కర్లేదు.




హైదరాబాద్: సంక్రాంతికి సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై శనివారం ఉదయం రద్దీ పెరిగింది. అబ్దులాపూర్‌మెట్ ఓఆర్ఆర్ వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి కొత్తగూడెం వరకు వాహనాలు నెమ్మదిగా కదులుతున్నాయి. చౌటుప్పల్ పంతంగి టోల్ ప్లాజా వద్ద వాహనాలు బారులు తీరాయి. సిబ్బంది 10 టోల్‌బూత్‌ల ద్వారా ఏపీ వైపు వెళ్తున్న వారిని పంపిస్తున్నారు. హైదరాబాద్ వైపు వచ్చే వారిని 6 గేట్ల ద్వారా పంపిస్తున్నారు. చౌటుప్పల్ కూడలిలో అండర్‌పాస్ నిర్మాణ పనుల వల్ల ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. రేపు(ఆదివారం) రద్దీ మరింత పెరుగుతుందనే అంచనాలున్నాయి. రద్దీ దృష్ట్యా ప్రత్యామ్నాయ మార్గాలను పోలీసులు సూచిస్తున్నారు. మరోవైపు ప్రయాణికులతో ఎంజీబీఎస్, జేబీఎస్, దిల్‌సుఖ్ నగర్ బస్టాండ్లు, ఎల్బీ నగర్ కూడలి రద్దీగా మారాయి.

# పాలనలో మరింత దూకుడు!

## 26 నుంచి సరికొత్త పాలన!!

## 'విదేశీ పర్యటన నుండి తిరిగి రాగానే కొత్త రేవంత్‌ను చూస్తాం!'




హైదరాబాద్ : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాలనలో మరింత దూకుడు పెంచేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో ఈనెల 26వ తేదీ నుంచి సరికొత్త పాలనకు శ్రీకారం చుట్టబోతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది. ఈ ఏడాది కాలంలో తాను అనుకున్న విధంగా రాష్ట్రాన్ని గాడిలో పెట్టేందుకు ఒక్కో అడుగు ముందుకు వేస్తూ వచ్చిన రేవంత్ అదే సమయంలో ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీలపై ఎదురు దాడినీ కొనసాగించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తూ సాగుతున్నారు. అయితే ఈ ఏడాది కాలంలో రేవంత్ సర్కార్ పాలనకు అత్తెసరు మార్కులే వచ్చాయి. హామీలను అమలు చేయడంలో రేవంత్ సర్కార్ కొంత మేర విఫలమైందన్న వాదన తెలంగాణ సమాజంలో బలంగా వ్యక్తమవుతోంది. ముఖ్యంగా రైతులకు మేలుచేసే విషయంలో ఏడాది కాలంలో ప్రభుత్వం ఆశించిన స్థాయిలో విజయవంతం కాలేదన్న అభిప్రాయం ఉంది. రెండు లక్షల బ్యాంకు రుణాలను మాఫీ చేసినప్పటి.. రైతులందరికీ రుణమాఫీ అందలేదు. దీంతో రుణమాఫీ కాని రైతులు రేవంత్ సర్కార్ పై గుర్రుగా ఉన్నారు. ప్రభుత్వం మాత్రం అర్హత ఉన్న ప్రతిఒక్కరికీ రుణమాఫీ చేస్తున్నామని చెబుతోంది. అయితే, ఏడాది కాలంలో వైఫల్యాలను సరిదిద్దుకుంటూ సరికొత్త పాలనకు శ్రీకారం చుట్టాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఇందుకోసం జనవరి 26వ తేదీని ముహూర్తంగా నిర్ణయించుకున్నారు. జనవరి 26వ తేదీ నుంచి సీఎం రేవంత్ రెడ్డి జిల్లాల పర్యటనకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. గడిచిన ఏడాదిలో పాలనాపరంగా, రాజకీయంగా జరిగిన లోటుపాట్లను గ్రహించి వాటిపై పట్టు సాధించేందుకు రేవంత్ ఫోకస్ పెట్టారు. అందుకోసం నేరుగా జిల్లాల్లోని ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను తెలుసుకునేందుకు ముఖ్యమంత్రి సిద్ధమవుతున్నారు. ఈనెల 14వ తేదీ నుంచి 24 వరకు రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనలకు వెళ్లనున్నారు. హైదరాబాద్ తిరిగి వచ్చిన తరువాత 26వ తేదీన రిపబ్లిక్ డే వేడుకల్లో పాల్గొని.. అదే రోజు జిల్లాల పర్యటనకు రేవంత్ శ్రీకారం చుట్టనున్నట్లు సమాచారం. శనివారం జరిగిన తెలంగాణ కేబినెట్ సమావేశంలో రేవంత్ రెడ్డి రైతు భరోసా పథకంపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ఆ పథకంతో పాటు మరికొన్ని పథకాలకు జనవరి 26వ తేదీ నుంచే రేవంత్ సర్కార్ శ్రీకారం చుట్టనుంది. అంతకు ముందు 16వ తేదీ నుంచే మంత్రులు నియోజకవర్గాల వారిగా పర్యటనలు చేయనున్నారు. జనవరి 26 నుంచి రేవంత్ సర్కార్ ప్రారంభించబోయే పథకాలపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించనున్నారు. కేబినెట్ సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. జనవరి 26 నుంచి రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం అమలుకు నిర్ణయించారు. కేబినెట్లో తీసుకున్న నిర్ణయాలపై స్వయంగా రేవంత్ రెడ్డి మీడియాకు వెల్లడించారు. గత ప్రభుత్వంలో రైతు బంధు పథకం కింద రెండు దఫాలుగా ఎకరానికి రూ. 10వేలు అందించింది. అయితే, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతీ ఎకరాకు రెండు దఫాలుగా రూ. 12వేలు ఇచ్చేందుకు నిర్ణయించింది. ఈ పథకానికి రైతు భరోసాగా నామకరం చేసిన విషయం తెలిసిందే. గత బీఆర్ఎస్ హయాంలో రైతులకు ఎన్ని ఎకరాలు ఉన్నా పరిమితి లేకుండా రైతు బంధు పథకం అమలైంది. ఆ క్రమంలో వ్యవసాయం యోగ్యం కాని భూములు, రాళ్లురప్పలు, మైనింగ్ కోసం కేటాయించిన భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్ వేసిన భూములకు, పరిశ్రమలకు కేటాయించిన భూములకు సైతం రైతు బంధు నిధులు పడ్డాయి. దీంతో ప్రజాధనం భారీగా వృథా అయ్యిందని గతంలో కేసీఆర్ ప్రభుత్వంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. ప్రస్తుతం రేవంత్ సర్కార్ రైతు భరోసా పథకం అమలు విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంది. కేవలం వ్యవసాయ యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా సాయం అందిస్తామని రేవంత్ రెడ్డి ప్రకటించారు. అదే సమయంలో పల్లెల్లో ఉంటూ భూమి లేని వ్యవసాయ రైతు కుటుంబాలకు కూడా ఏడాదికి రూ. 12వేలు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పథకానికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసాగా పేరును ఖరారు చేశారు. రేవంత్ సర్కార్ నిర్ణయంతో ప్రజల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమ వుతు న్నాయి. అసలైన రైతులకు, భూమిలేని కుటుంబాలకు మేలు జరిగేలా కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయం ఉందని పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు చేసుకున్న వారు కళ్లు కాయలు కాసేలా ఎదురుచూసినా కొత్తకార్డులు రాలేదు. ప్రస్తుతం కాంగ్రెస్ హయాంలో అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డు ఇవ్వాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. రైతు భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలను జనవరి 26వ తేదీనే శ్రీకారం చుట్టాలని రేవంత్ రెడ్డి భావిస్తున్నారు. ఈ క్రమంలో జనవరి 26 నుంచి రేవంత్ సర్కార్ సరికొత్త పాలన ప్రారంభమవుతుందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. మొత్తానికి ఏడాది పాలనలో లోటుపాట్లను సరిచేసుకుంటూ రాబోయే కాలంలో మరింత మెరుగైన పాలనను తెలంగాణ ప్రజానీకానికి అందించేందుకు రేవంత్ సర్కార్ సిద్ధమవుతున్నది.

# సంపాదకీయం

## పురందేశ్వరి వ్యూహాత్మక మౌనం.. మంచిదేనా ..!

బీజేపీ ఏపీ చీఫ్, సీనియర్ నాయకురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి.. చాలా వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారు. అటు నియోజకవర్గంలోనే కాకుండా.. ఇటు కూటమి సర్కారు విషయంలోనూ చాలా ఆచి తూచి వ్యవహరిస్తున్నారు. నిజానికి ఆమె ముందు అనేక సవాళ్లు ఉన్నాయి. అనంతపురం నుంచి విశాఖ వరకు.. బీజేపీ తరఫున ఎన్నికైన ప్రజాప్రతినిధుల విషయం అనేక విమర్శలకు తావిస్తోంది. మరోవైపు.. పార్టీ పరంగా సభ్యత్వాల నవెూదు కూడా.. ఆశించినట్టు జరగడం లేదు. ఆదినారాయణ రెడ్డి నుంచి సీఎం రమేష్ వరకు.. సుజనా చౌదరి నుంచి కామినేని శ్రీనివాస్ దాకా.. ఎవరి దారిలో వారు ప్రయాణిస్తున్నారు. ఎవరూ కూడా పురందేశ్వరి మాట లెక్క చేయడం లేదన్న వాదన పార్టీ వర్గాల్లోనే వినిపిస్తుండడం గమనార్హం. ఇక, గతంలో చక్రం తిప్పిన సోము వీర్రాజు ఇప్పుడు అసలు ఎక్కడ ఉన్నారో.. ఏం చేస్తున్నారో కూడా కనిపించడం లేదు. అలాగే.. వైసీపీ హయాంలో తరచుగా మీడియా ముందుకు వచ్చిన విష్ణు వర్ధన్‌రెడ్డి కూడా.. ఇప్పుడు కనిపించకపోవడం గమనార్హం. ఇక, విశాఖ ఉత్తరం ఎమ్మెల్యే విష్ణు కుమార్ రాజు బీజేపీ కార్యక్రమాల కంటే కూడా.. టీడీపీ కార్యక్రమాల్లో నే ఎక్కువగా కనిపిస్తున్నారని కమల నాథులే చెప్పుకొంటున్నారు. ఇక, పార్టీ అధిష్టానం చెప్పినట్టుగా సభ్య త్వనమోదు కూడా ముందుకు సాగడం లేదు. వెరసి ఏపీలో బీజేపీ పరిస్థితి అటు కాయాకాదు.. ఇటు పిందీ కాదు.. అన్న చందంగా తయారైంది. ఒకప్పుడు అంతర్వేది రథం ఘటన జరిగినా.. విజయనగరం జిల్లా రామతీర్థం ఘటన జరిగినా.. బీజేపీ స్పందించింది. నాయకులు మీడియా ముందుకు వచ్చి మాట్లాడిన సందర్భాలు ఉన్నాయి. కానీ, ఇప్పుడు తిరుపతి వంటి అతి పెద్ద ఘటన జరిగిన తర్వాత.. కేవలం నాలుగు ముక్కలు ఎక్స్‌లో పోస్టు చేయడం వరకే పురందేశ్వరి పరిమితం అయ్యారు. బాధిత కుటుంబాలను కానీ.. ఇబ్బందులు పడ్డ కుటుంబాలను కానీ.. ఆమె పరామర్శించలేక పోయారు. దీంతో పురందేశ్వరి వ్యవహారం ఇటు బీజేపీలోనే కాకుండా రాజకీయంగా కూడా చర్చకు వచ్చింది. మరి ఆమె వ్యూహాత్మకంగా పాటిస్తున్న ఈ మౌనం .. పార్టీకి మంచి చేస్తుందా? చెడు చేస్తుందా? అనేది చూడాలి.

# గోదాముల్లోనే ధాన్యం నిల్వ



హుజూర్‌నగర్ : భారీగా ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న నేపథ్యంలో వాటి నిల్వకు సమస్య రాకుండా ముందుగానే నీటిపారుదల, పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మార్కెట్ గోదాములను వాడుకునేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని మిల్లింగ్ కోసం మిల్లులకు కేటాయిస్తారు. గత రెండు సీజన్‌ల ధాన్యం నిల్వలు మిల్లుల్లో ఉన్నాయని, ఇప్పుడు ధాన్యం దించుకునేందుకు స్థలం లేదని మిల్లర్లు చెబుతున్నారు. దీంతో కొన్న ధాన్యాన్ని మిల్లుకు కేటాయించి మార్కెట్ గోదాములో నిల్వ చేసుకునేలా చర్యలు తీసుకున్నారు. మార్కెట్ గోదాములలో ఏ మిల్లుకు ధాన్యం కేటాయిస్తారో ఆ మిల్లుకు మార్కెట్ కమిటీ వారు స్థలం కేటాయిస్తారు. అలా కేటాయించిన స్థలంలో ధాన్యం నిల్వ చేస్తారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో కొన్ని మార్కెట్ గోదాములలో ధాన్యం దిగుమతి జరుగుతోంది. మార్కెట్ అధికారులు మాత్రం ఇంకా అధికారిక ఉత్తర్వులు రాలేదంటున్నా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ధాన్యం దిగుమతి చేసుకుంటున్నట్లు తెలిపారు.

**రైతుల కోసం కేటాయించాల్సినవి..**

రైతులు తమకు మద్దతు ధర రాలేదని అనుకున్నప్పుడు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్ కమిటీ గోదాములలో నిల్వ చేసుకునే వారు. నిల్వ చేసుకున్న ధాన్యానికి రుణం కూడా ఇచ్చేవారు. మొదటి 90 రోజులు ఉచితంగా నిల్వ చేసుకునే అవకాశం ఉంది. తరువాత అతి కొద్ది ఛార్జీతో రైతు మరికొంత కాలం నిల్వ చేసుకునే అవకాశం ఉండేది. కానీ ఇటీవలి కాలంలో రైతులు ఈ గోదాములలో నిల్వ చేసుకునేందుకు ముందుకు రావడం లేదు. కొన్ని సందర్భాల్లో మిల్లర్లు వాడుకుంటున్న పరిస్థితి ఉంది.

**ప్రభుత్వ కార్యక్రమానికే..** ప్రస్తుతం ధాన్యం పండించిన రైతులకు మద్దతు ధర కల్పించడం, కొన్న ధాన్యాన్ని సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) చేసి తిరిగి పౌరసరఫరాలశాఖ రేషన్ దుకాణాల ద్వారా బియ్యం సరఫరా చేయడం జరుగుతోంది. ప్రస్తుతం అనూహ్యమైన ధాన్యం దిగుబడి రావడంతో ఆ ధాన్యం నిల్వ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ మొత్తం వ్యవహారం ప్రభుత్వమే నిర్వహిస్తున్నందున ధాన్యం నిల్వకు మార్కెట్ గోదాములను ఉపయోగించాలని నిర్ణయించారు. ఉమ్మడి జిల్లాలో 21 మార్కెట్‌లు ఉన్నాయి. ఇందులో కొత్తవి కాకుండా పాత మార్కెట్‌లన్నింటికీ గోదాములు ఉన్నాయి. వీటిని ప్రభుత్వమే.. అదీ రైతు ప్రయోజనం కోసమే వాడుకుంటున్నందున నిల్వ చేసిన ధాన్యానికి ఎలాంటి ఛార్జీలు వసూలు చేయరాదని ప్రభుత్వం నిర్ణయించింది.

**సీఎంఆర్ ధాన్యానికి భద్రత..**

ఒత్తిడి చేసి అప్పగించడం వల్ల కొందరు మిల్లర్లు ధాన్యం తీసుకొని సొంత వ్యాపార అవసరాలకు అమ్ముకొని తరువాత సీఎంఆర్ పెట్టేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మార్కెట్ గోదాముల్లోనే ఉంచడం వల్ల తిరిగి ధాన్యం తీసుకు పోయేటప్పుడు పౌరసరఫరాల అధికారుల అనుమతి అవసరం ఉంటుంది. దీంతో ధాన్యం ఎత్తగానే బియ్యం కోసం అధికారులు మిల్లర్లను ఒత్తిడి చేసే అవకాశం ఉంటుంది. దీనివల్ల సీఎంఆర్ ధాన్యం పక్కదోవ పట్టకుండా ఉంటుందన్న ఆలోచన కూడా పౌరసరఫరాలశాఖ అధికారుల్లో ఉంది.

# మూడుముళ్ల బంధం.. మాయగాళ్ల గండం



హైదరాబాద్: సంతోష్‌నగర్‌కు చెందిన వ్యక్తికి వివాహ పరిచయ వేదికపై మహిళ పరిచయమైంది. ఇద్దరి మధ్య సాన్నిహిత్యం పెరిగాక... ఆమె కుటుంబ ఖర్చులు, పుట్టినరోజులంటూ అతడి నుంచి రూ.5లక్షలు స్వాహా చేసింది. పెళ్లి ఊసెత్తగానే నానా గొడవ చేయటంతో ఆందోళనకు గురైన బాధితుడి తల్లి బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురై మరణించింది" మణికొండకు చెందిన ఓ యువతి పెళ్లయిన ఏడాదికే భర్త నుంచి విడిపోయారు. మరో జోడుకోసం వెతికే క్రమంలో మ్యాట్రిమోనీ వెబ్‌సైట్‌లో యువకుడి ప్రొఫైల్ చూసి వివరాలు సేకరించారు. ఇద్దరి మధ్య కొద్దిరోజులు వాట్సాప్ ఛాటింగ్స్.. మాటలు జరిగాక తన బ్యాంకు ఖాతా లావాదేవీలు నిలిపివేశారని, తదితర కారణాలు చూపుతూ 3 నెలల వ్యవధిలో రూ.4.5లక్షలు కాజేశాడు. ఆ తరువాత ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. నిందితుడు పశ్చిమగోదావరిజిల్లాకు చెందిన వ్యక్తిగా తేలింది.

మూడుముళ్ల బంధంతో ఒక్కటయ్యే ప్రయత్నంలో యువతీ, యువకులు మాయగాళ్ల బారిన పడుతున్నారు. కొన్ని వివాహ పరిచయ వేదికలను అడ్డాగా మార్చుకున్న కేటుగాళ్లు నకిలీ ఫొటోలు, చిరునామాలతో బురిడీ కొట్టిస్తున్నారు. మరోవైపు కొందరు కిలేడీలు తామే కాబోయే పెళ్లికూతుళ్లమంటూ అబ్బాయిలకు దగ్గరై సొమ్ము కొట్టేస్తున్నారు. ఎవరైనా నిలదీస్తే పెళ్లి పేరిట తమనే మోసగించారంటూ ఠాణాల్లో ఫిర్యాదు చేస్తున్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు నగర పరిధిలో 50కు పైగా పెళ్లిపేరిట మోసపోయినట్లు ఫిర్యాదులు అందాయి. ప్రత్యక్షంగా వధూవరులను చూడకుండా నిర్ణయం తీసుకోవద్దని... నగదు ముందుగానే కావాలంటున్నారంటే మోసపోతున్నట్లు గుర్తించాలని పోలీసులు సూచిస్తున్నారు.సామాజిక మాధ్యమాలు, వెబ్‌సైట్లలో నకిలీ ప్రొఫైల్స్‌తో మోసాలకు పాల్పడే ముఠాలు రెండురకాలుగా బురిడీ కొట్టిస్తున్నారు. కొందరు విదేశాల్లో ఉంటున్న ప్రవాస భారతీయులుగా పరిచయం చేసుకుంటారు. మరోతరహా కేటుగాళ్లు ఏపీ, తెలంగాణల్లో ఫలానా కుటుంబాలకు చెందిన వారీగా పరిచయం చేసుకుంటారు.

# ఆయిల్‌పాం సాగు.. ధర బాగు



చేగుంట: దీర్ఘకాలంగా దిగుబడులు ఇచ్చే ఆయిల్‌పాం సాగు చేయాలని ప్రభుత్వం రైతులను ప్రోత్సహిస్తోంది. సాగు చేస్తున్న కర్షకులకు ప్రోత్సాహకాలను అందజేస్తోంది. దీంతో సాగు చేసేందుకు ఔత్సాహికులైన రైతులు ముందుకు వస్తున్నారు. కానీ ధర విషయంలో సందేహాలు ఉండటంతో నిరాశలో ఉండిపోయారు. ఇలాంటి పరిస్థితుల్లో దీని ధర పెరుగుతూ వస్తోంది.

**మరో ఏడాదిలో దిగుబడి**

జిల్లాలో చాలా బీడు భూములు ఉన్నాయి. వాటిలో ఆయిల్‌పాం సాగు చేస్తే లాభాలను ఆర్జించవచ్చు. ప్రస్తుతం టన్ను ధర రూ.20,413 ఉండటంతో సాగు చేస్తున్న రైతులు ఆనందంగా ఉన్నారు. ఉద్యానవనాధికారులు మూడేళ్ల నుంచి సాగును ప్రోత్సహిస్తున్నారు. మూడేళ్ల క్రితం నాటిన మొక్కలు మరో ఏడాదిలో దిగుబడులను ఇవ్వనున్నాయి. మొదట్లో అన్నదాతలు సాగు చేసేందుకు అంతగా ఆసక్తి చూపించలేదు. కానీ రానురాను వారిలో మార్పు కనిపిస్తోంది.

**ప్రభుత్వ ప్రోత్సాహం**

రాష్ట్ర ప్రభుత్వం ఆయిల్‌పాంను సాగు చేయాలని చెబుతున్నా.. ఆశించిన స్థాయిలో కనిపించడం లేదు. ఉద్యానవనాధికారులు ఎకరానికి 50 మొక్కలు ఇచ్చి మూడేళ్ల నిర్వహణకు రాయితీని కూడా అందజేస్తున్నారు. జిల్లాలో ఏటా 2 వేల ఎకరాల్లో మొక్కలు నాటించాలని లక్ష్యంగా నిర్దేశించారు. 2023–24లో ఐదు వేల ఎకరాల్లో సాగు చేయాలని భావించారు. కానీ చాలా తక్కువ ఎకరాల్లో సాగుచేశారు. ఈ సంవత్సరం 2000 ఎకరాల్లో సాగు చేయాలని అనుకున్నారు. అందుకు 1560 మంది రైతులు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. ఇందులో 900 ఎకరాలకు రైతు వాటా డబ్బులు చెల్లించారు. ఇప్పటి వరకు 275 ఎకరాల్లో సాగుచేశారు.

**మంచి ఆదాయం**

ఆయిల్‌పాం మొక్కలు నాటిన నాలుగో సంవత్సరం నుంచి 25 ఏళ్ల వరకు పంట తీసుకోవచ్చు. ఎకరానికి 12 టన్నుల దిగుబడి వస్తుంది. టన్నుకు రూ.20 వేలు వచ్చినా.. పెట్టుబడులు పోను ఎకరానికి రూ.లక్ష వరకు ఆదాయం వస్తుంది. అంతేకాకుండా నాలుగేళ్ల పాటు అంతర పంటగా వివిధ రకాల పంటలను సాగు చేసుకోవచ్చు. నాలుగేళ్లు కూడా ఆదాయం పొందేందుకు అవకాశం ఉంది.

**పెరుగుతున్న డిమాండ్**


అంతర్జాతీయ స్థాయిలో పామాయిల్‌కు బాగా డిమాండ్ ఉంది. ఇండోనేసియా, మలేసియా నుంచి దిగుబడులు చేసుకోవాల్సి వస్తోంది. దీనిని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లోనే సాగు చేపట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. గత ఏడాది ధర చాలా తగ్గిపోయింది. దీంతో రైతులు ఆందోళన చెందారు. ఈసారి మాత్రం ప్రారంభంలో రూ.13 వేలు ఉండగా ప్రస్తుతం రూ.20 వేలకు చేరింది. దీనివల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుంది.

# నేతన్నల సంక్షేమానికి 'చేనేత అభయహస్తం'

చౌటుప్పల్ : 'కళాత్మకమైన చేనేత వస్త్రాలను మగ్గాలపై నేసే కళాకారులు యాదాద్రి భువనగిరి జిల్లాలోనే అధిక సంఖ్యలో ఉన్నారు. ఇక్కడ చేనేత కళాకారులు రూపొందించే పోచంపల్లి పట్టుచీర, పుట్టపాక తేలియా రుమాల్ జాతీయస్థాయిలో భౌగోళిక గుర్తింపును పొందాయి. జిల్లాలో ఇక్కత్ డిజైన్లతో నేసే వివిధ రకాల వస్త్రాలకు అంతర్జాతీయంగా గుర్తింపు ఉంది. చేనేత కళాకారుల సంక్షేమానికి ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తుంది. మగ్గం నేసే కార్మికులను గుర్తించి జియోట్యాగింగ్ చేసి ప్రత్యేకమైన నెంబరును చేనేత, జౌళిశాఖ ద్వారా కేటాయించారు. చేనేత సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం 'చేనేత అభయహస్తం' పేరుతో అమలు చేయనున్నట్టు ప్రకటించిందని'.. ముఖాముఖిలో చేనేత, జౌళిశాఖ జిల్లా సహాయ సంచాలకుడు కామిల్ మహమ్మద్ వివరించారు.

**జిల్లాలో ఎంతమందిని గుర్తించారు?**

కామిల్: వస్త్రాలను నేసే చేనేత మగ్గాలను, కళాకారులను గుర్తించి వాటికి జియోట్యాగింగ్ చేశాం. జిల్లాలో 6771 చేనేత మగ్గాలకు,



2240 మర మగ్గాలకు జియోట్యాగింగ్ చేసి ప్రత్యేక నెంబర్లు కేటాయించాం. సహకార చట్టం కింద ఏర్పాటైన 48 చేనేత సంఘాలున్నాయి. ఇంకా ఎవరైనా మగ్గం నేస్తున్నవారు జియోట్యాగింగ్ కాకుండా మిగిలుంటే మా కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. క్షేత్రస్థాయిలో పరిశీలించి, విచారణ నిర్వహించి ట్యాగింగ్‌కు సిఫార్సు చేస్తాం.

**నేతన్నకు చేయూత పథకం అమలవుతుందా?**

కామిల్: రాష్ట్ర ప్రభుత్వం ద్వారా 'నేతన్నకు చేయూత' పేరుతో పొదుపు పథకం అమలైంది. నేత కార్మికులు తమ వేతనంలో 8శాతం పొదుపు ఖాతాలో జమచేస్తే ప్రభుత్వం దానికి రెట్టింపు 16శాతం జమచేసింది. మూడేళ్ల కాల వ్యవధి ఇటీవల పూర్తవడంతో ఈ పథకంలో చేరిన 11389 మందికి రూ.68.59 కోట్లు వారి ఖాతాల్లో జమచేశాం. ఈ పథకం పునరుద్ధరణకు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు ఆదేశాలు అందలేదు.

**ఇక్కడి కళాకారులు ఏ రకం వస్త్రాలను తయారు చేస్తారు?**

కామిల్: 'ఇక్కత్' అనేది అంతర్జాతీయంగా గుర్తింపున్న చేనేత కళ.. జిల్లాలో ఈ డిజైన్లతో పట్టు, నూలు, మస్‌రైజ్డ్ చీరలు, డ్రెస్ మెటీరియల్, దుపట్టాలు, బెడ్‌షీట్లు, రుమాళ్లు, చేతి రుమాళ్లు మగ్గాలపై నేస్తుంటారు. వీటిని సహకార సంఘాల, 'టెస్కో' ద్వారా కొనుగోలు చేసి షోరూముల్లో, వస్త్ర ప్రదర్శనశాలల్లో విక్రయిస్తుంటారు. అన్ని ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లు టెస్కో ద్వారానే వస్త్రాలు కొనుగోలు చేయాలని ఇటీవల ప్రభుత్వం జీవో విడుదల చేసింది.

**నేతన్న బీమా పథకం అందరికీ వర్తిస్తుందా?**

కామిల్: జియోట్యాగ్ మగ్గం నేస్తున్న చేనేత కార్మికుడికి, ఆ మగ్గంతో నమోదైన అనుబంధ కార్మికులకు నేతన్న బీమా పథకం వర్తిస్తుంది. ఇప్పటివరకు 18 నుంచి 59 ఏళ్ల వయో పరిమితి ఉండేది. ఈ పథకంలో నమోదైన చేనేత కార్మికుడు మరణిస్తే అతని నామినీకి ఎల్‌ఐసీ ద్వారా రూ.5లక్షలు బీమా అందేది. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 14 నుంచి వయో పరిమితిని తొలగించింది. 59 ఏళ్ల పైబడి వయసున్న చేనేత కార్మికులు మరణిస్తే చేనేత, జౌళిశాఖ బీమా పరిహారం అందించాలని నిర్ణయించారు. ఈ పథకంలో ప్రస్తుతం 10686 మంది నమోదై ఉన్నారు.

# పింఛన్లకు ఎదురుచూపులు

గజ్వేల్ : జిల్లాలో ఆసరా పింఛన్ల కోసం వందల మంది ఎదురుచూస్తున్నారు. నాలుగేళ్లుగా కొత్త వాటికి మంజూరు ఇవ్వకపోవడంతో దరఖాస్తులు పెట్టుకున్న వారు ఆర్థిక చేయూత లేక యాతన పడుతున్నారు. ముఖ్యంగా వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు నిత్యం కార్యాలయాలు, రాజకీయ నాయకుల ఇళ్ల చుట్టూ తిరుగుతున్నారు.నిరుపేదలకు ఆర్థిక చేయూత ఇచ్చేందుకు ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న విషయం తెల్సిందే. ఇందులో భాగంగా



వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, బీడీ, గీతా కార్మికులు, నేతన్నలకు ప్రభుత్వం నెలనెలా రూ.2016 నుంచి రూ.3016 వరకు పింఛన్లు అందిస్తోంది. అర్హులైన పేదవారు దరఖాస్తు చేసుకున్న వంద రోజుల్లో కొత్త పింఛన్లు అందిస్తామని గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రకటించినా అమలు చేయలేదన్న విమర్శలున్నాయి. తాము అధికారంలోకి వస్తే కొత్త వాటితో పాటు పాతవి రెట్టింపు చేస్తామన్న నేతలు కూడా ఇంకా వీటిపై దృష్టి సారించడం లేదు. జిల్లాలోని ఐదు మున్సిపాలిటీల్లో వందల మంది పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. **వృద్ధుడు మృతి చెందితే ఆయన భార్యకు..** కొత్త పింఛన్ల మంజూరులో శ్రద్ధ చూపని సర్కారు ఏ ఇంట్లోనైనా పింఛన్ అందుకునే వృద్ధుడు మృతి చెందితే అతడిది రద్దు చేసి భార్యకు వితంతు పింఛన్ కింద మార్చి ఇస్తున్నారు కానీ కొత్తవి మాత్రం ఇవ్వడం లేదు.

# ఆపదలో అడవి



నల్గొండ : గత రెండేళ్ల నుంచి అటవీ విస్తీర్ణం క్షేత్రస్థాయిలో గణనీయంగా తగ్గుతూ వస్తోంది. కేంద్ర పర్యావరణ, అటవీశాఖ ఇటీవల విడుదల చేసిన 'ఇండియా స్టేట్ ఆఫ్ ఫారెస్ట్ రిపోర్ట్' ప్రకారం 2021-24 మధ్యకాలంలో నల్గొండ మినహా మిగిలిన రెండు జిలాల్లో అడవుల విస్తీర్ణం తగ్గినట్లు తేలింది. ఇదే కొనసాగితే రానున్న రోజుల్లో మూడు జిల్లాల్లోనూ ఉష్ణోగ్రతలు ఎక్కువగా నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని పర్యావరణ వేత్తలు హెచ్చరిస్తున్నారు. హరితహారంతో 5 నుంచి 10 శాతం అరణ్య విస్తీర్ణం పెరిగినట్లు గతంలో అధికారులు చెప్పారు. కానీ గతేడాది పోడు పట్టాలు ఇవ్వడం, కొత్త పోడు భూములకు కూడా హక్కులు కల్పించడం వల్ల అటవీ విస్తీర్ణం తగ్గుముఖం పట్టిందని అధికారులు చెబుతున్నారు. ఫారెస్ట్ సర్వే ఆఫ్ ఇండియా ప్రతి రెండేళ్లకోసారి ఉపగ్రహం ద్వారా దేశంలోని అటవీ విస్తీర్ణాన్ని లెక్కిస్తోంది. నిర్ణీత ప్రదేశంలో ఉండే చెట్ల సంఖ్యను బట్టి అటవీ ప్రాంతాన్ని దట్టమైన, మధ్యస్థాయి, బహిరంగ అడవులుగా విభజించి అధ్యయనం చేస్తారు. ఉమ్మడి జిల్లాలో యాదాద్రి సర్కిల్ పరిధిలో మూడు అటవీ డివిజన్లు, 11 అటవీ రేంజ్‌లున్నాయి. నల్గొండ జిల్లా పరిధిలో అటవీ విస్తీర్ణం పెరగ్గా యాదాద్రి, సూర్యాపేట జిల్లాల్లో గణనీయంగా తగ్గింది. ఉమ్మడి నల్గొండ జిల్లాలో దట్టమైన అటవీ విస్తీర్ణం 0.03 చ.కి.మీటర్లలో ఉండగా, మధ్య స్థాయిలో 23.01 చ.కి.మీ, బహిరంగ(ఓపెన్ ఫారెస్ట్)అటవీ విస్తీర్ణం 527.27గా ఉందని వెల్లడైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 2022-23 సంవత్సరంలో మొత్తం 34 అగ్నిప్రమాదాలు చోటు చేసుకున్నాయి. 2023-24 మధ్య కాలంలో వీటి సంఖ్య 49 ఉన్నాయి. గతేడాది కంటే ఈసారి 15 ప్రమాదాలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి.

# సంతోషాలను 'ఏరు'కో..!

భద్రాచలం : తెలుగు రాష్ట్రాల్లో పర్యాటక ప్రాంతాలంటే సాధారణంగా ఏపీలోని కోనసీమ అందాలు.. మారేడుమిల్లి పాపికొండలు.. బొర్రా గుహల పేర్లు వినిపిస్తుంటాయి. అదేస్థాయిలో అనుభూతులను పంచేందుకు 'ఏరు' ఉత్సవం వేదికవనుంది. నీటివనరులను ఆస్వాదించేందుకు భద్రాచలం మన్యం కేంద్రంగా సాగే ఈ యాత్ర పూర్తిగా ప్రకృతితో మమేకం చేస్తుంది. దైనందిన జీవితంలో అలసినవారు సంతోషాలను ఏరుకునే యాత్ర ఇది. తొలి విడతగా ఏరు ఉత్సవాన్ని గురువారం ప్రారంభించి శనివారం వరకు కొనసాగిస్తారు. ఆ తర్వాత ప్రతి మూడు రోజులకు ఒక ప్యాకేజీ కింద పర్యాటకులను ఆహ్వానిస్తారు. స్నానఘట్టాల వద్ద ఆహార పదార్థాలు, హస్త కళారూపాలను స్టాళ్లలో ఉంచారు. కలెక్టర్ జితేష్ వి.పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్ చొరవతో 'రివర్ ఫెస్టివల్'కు రూపకల్పన జరగటంతో భద్రాద్రి జిల్లా పర్యాటకానికి మహర్దశ పట్టనుంది.

**మూడు రోజులు యాత్ర ఇలా..**

1. గురువారం తెల్లవారుజామున 3 గంటలకు భద్రాచలంలోని గోదావరి ఒడ్డున ఏర్పాటుచేసిన క్యాంప్ కుటీరాలకు పర్యాటకులు చేరుకుంటారు. వీటిలో ఇద్దరు, ముగ్గురు, నలుగురు చొప్పున ఉండేలా అధికారులు ఏర్పాట్లు చేశారు. టీ లేదా కాఫీ, బిస్కెట్లు ఇస్తారు. బోట్ షికారు చేయవచ్చు. సాయంత్రం 5 గంటలకు ఘాట్‌పై సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. రాత్రి 8 గంటలకు క్యాంప్



కుటీరాలకు చేరుకుని క్యాంప్ ఫైరును ఆస్వాదించవచ్చు. అక్కడే రాత్రి భోజనం ఉంటుంది.

2. శుక్రవారం తెల్లవారుజామున 5 గంటలకు ఉత్తర ద్వార దర్శనం చేసుకోవచ్చు. 7 గంటలకు అల్పాహారం, 8 గంటలకు కిన్నెరసాని బోట్ షికారు, మధ్యాహ్నం 12కి భద్రాచలం ఐటీడీఏ కార్యాలయంలోని మ్యూజియాన్ని సందర్శిస్తారు. ఇక్కడ సృష్టించిన ఆదివాసీ పల్లెను చూడవచ్చు. అక్కడే మధ్యాహ్న భోజనం చేయాలి. సాయంత్రం 4 గంటలకు బొజ్జిగుప్ప ఆదివాసీ పల్లెను సందర్శిస్తారు. అక్కడే రాత్రి భోజనం ఉంటుంది. అక్కడి వాగులో బోటింగ్ చేయవచ్చు. ఆదివాసీ సంప్రదాయ నృత్యాలను చూడవచ్చు. రాత్రి 8కి తిరిగి క్యాంప్ కుటీరాలకు చేరుకొని బస చేస్తారు.

3. శనివారం ఉదయం 8 గంటలకు అల్పాహారం చేసి చంద్రుగొండ మండలం కనగిరిగుట్ట ట్రెక్కింగ్‌కు చేరుకోవాలి. అక్కడ టీ, స్నాక్స్‌తో పాటు మధ్యాహ్న భోజనం ఉంటుంది. గుట్ట పైనుంచి ప్రకృతి అందాలను ఆస్వాదించవచ్చు. మధ్యాహ్నం ఒంటి గంటకు కొత్తగూడెం చేరుకున్నాక యాత్ర పూర్తవుతుంది. మూడు రోజుల ప్యాకేజీలో టికెట్ ధర పెద్దలకు ఒక్కొక్కరికి రూ.6వేలు, 12ఏళ్లలోపు పిల్లలకు రూ.4వేలు నిర్ణయించారు.

మాది ములకలపల్లి మండలం. మాలాంటి పది మంది మహిళలకు ఆవులు, గేదెలు ఉండటంతో స్వచ్ఛమైన నెయ్యి విక్రయిస్తున్నాం. దీనికి అధికారుల నుంచి ధ్రువపత్రం ఉంది. రాములోరి క్షేత్రంలో ఏరు ఉత్సవాల సందర్భంగా స్టాల్ ఏర్పాటుకు అవకాశం లభించింది. ఆదరణ బాగుండటంతో ఈ రంగంలో రాణిస్తామనే నమ్మకం కలిగింది.టి.మంజుల, జి.లత

భద్రాచలం ఐటీడీఏ సహకారంతో రాగి, జొన్న, కొర్రలతో బిస్కెట్లు తయారు చేస్తుంటాం. ఏరు ఉత్సవం సందర్భంగా స్టాల్‌లో వీటిని ఉంచుతున్నాం. పర్యాటకులు తిని మెచ్చుకుంటున్నారు. పర్యాటకుల సంఖ్య పెరిగే అవకాశముంది. మాకు ఉపాధి లభిస్తుందనే భరోసా కలిగింది.

టి.లలిత, వి.వెంకటలక్ష్మి

భద్రాచలంలో బ్యూటీషియన్ శిక్షణ తీసుకున్నాం. తక్కువ పెట్టుబడితో మేం ఏర్పాటుచేసిన మెహందీ స్టాల్‌కు ఆదరణ లభిస్తోంది. ముక్కోటి, ఏరు ఉత్సవాలకు వచ్చేవారు మెహందీకి ప్రాధాన్యమిస్తుండటంతో స్వయం ఉపాధిపై మాకు నమ్మకం ఏర్పడింది. ఈ ప్రాంత యువతకు ఇదో చక్కని అవకాశం.

ఎం.రేణుక, కె.పావని, ఎస్.దుర్గ

# సాఫీగా సాగేనా..!



చౌటుప్పల్ : సంక్రాంతి సెలవులొచ్చాయంటే చాలు హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల జాతర నెలకొంటుంది. రాజధాని నుంచి వాహనాలు పల్లెటూర్లకు ఒకదాని వెనుక ఒకటి బారులు తీరుతుంటాయి. ఈ రద్దీలో గంట ప్రయాణానికి మూడు, నాలుగు గంటల సమయం పడుతుంది. గతేడాది సంక్రాంతికి ఇదే సమస్య తలెత్తడంతో వాహనచోదకులు, ప్రయాణికులు ట్రాఫిక్‌జామ్‌లో చిక్కుకొని నరకం చూశారు. ఇప్పటికే తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు జనవరి 11 నుంచి 17 వరకు పండగ సెలవులను ప్రకటించాయి. 11న రెండో శనివారం కావడంతో పదో తేదీన శుక్రవారం సాయంత్రం నుంచే రద్దీ మొదలయ్యే అవకాశముంది. సోమవారం భోగి కావడంతో.. శని, ఆది రెండ్రోజులు రద్దీ అధికంగా ఉండనుంది. నిరుడు భోగికి ముందు రోజు యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం పంతంగి టోల్ ప్లాజా మీదుగా 77 వేల పైచిలుకు.. అంతకుముందు రోజూ 67 వేలకు పైగా వాహనాలు వెళ్లాయి. రెండు రోజుల్లోనే 1.45లక్షల వాహనాలు రికార్డు స్థాయిలో వెళ్లడం గతేడాదే తొలిసారి. ఈ సారి కూడా గతేడాది స్థాయిలోనే వాహనాలు వెళ్లే అవకాశాలు మెండుగా ఉండటంతో.. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా జాతీయ ప్రాధికార సంస్థ(ఎన్‌హెచ్ఏఐ) ముందస్తు చర్యలకు సిద్ధమైంది. హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగశ్వర్‌రావు ఇప్పటికే టోల్‌ప్లాజాల ఏజెన్సీలకు తగిన సూచనలు జారీ చేశారు.

**అదనపు సౌకర్యాలు, సిబ్బంది**

పండక్కి వెళ్లే వాహనాల రద్దీ నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఏజెన్సీల అధికారులతో ఎన్‌హెచ్ఏఐ పీడీ నాగేశ్వర్‌రావు హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. పంతంగి టోల్‌ప్లాజాను కూడా సందర్శించి పలు సూచనలు చేశారు. టోల్‌ప్లాజాలు, ప్రమాదకర కూడళ్ల వద్ద అదనపు సౌకర్యాలను, సిబ్బందిని నియమించుకోవాలని తెలిపినట్లు పీడీ తెలిపారు. మూడు టోల్‌ప్లాజాల వద్ద పెట్రోలింగ్ వాహనం, క్రేన్, అంబులెన్సును, 30 కిలో మీటర్లకు ఒక క్రేన్, పెట్రోలింగ్ వాహనం, అంబులెన్సు, 60 కిలోమీటర్లకు ఒక టోయింగ్ వెహికిల్ ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

**తొలిసారిగా ఏజెన్సీలకు బాధ్యత..**

హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి మొత్తం 273 కిలోమీటర్లు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ మండలం దండుమల్కాపురం నుంచి ఏపీలోని నందిగామ వరకు 181.5 కిలోమీటర్లు టోల్‌రోడ్డు ఉంటుంది.

టోల్‌రోడ్డు పరిధిలో తెలంగాణలో పంతంగి(చౌటుప్పల్), కొర్లపహాడ్(కేతేపల్లి), ఏపీలో చిల్లకల్లు వద్ద టోల్‌ప్లాజాలున్నాయి. దీన్ని జీఎమ్మార్ సంస్థ నిర్మించింది. 2012 డిసెంబరు నుంచి 2024 జూన్ 31 వరకు టోల్ వసూళ్లతోపాటు రోడ్డు నిర్వహణను జీఎమ్మార్ సంస్థ పర్యవేక్షించింది. గతేడాది జులై ఒకటి నుంచి టోల్ వసూళ్లను మూడు ఏజెన్సీలకు ఎన్‌హెచ్ఏఐ అప్పగించింది. రోడ్డు నిర్వహణను మరో ఏజెన్సీకి అప్పజెప్పింది. ఇప్పుడు ఈ ఏజెన్సీలే రద్దీ నియంత్రణ చర్యలు చేపట్టనున్నాయి. ఎన్‌హెచ్ఏఐ, పోలీసు అధికారుల సూచనలతో టోల్‌ప్లాజాల వద్ద, ప్రధాన పట్టణాల్లో రద్దీ నివారణకు చర్యలు తీసుకుంటామని ఏజెన్సీలు వెల్లడించాయి.

# పనులు పూర్తికాక.. అద్దెలు చెల్లించలేక..!

ఖమ్మం: విద్యార్థులకు స్థానికంగా వైద్యవిద్యనందించేందుకు ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు ప్రభుత్వం నర్సింగ్, వైద్యకళాశాలలను మంజూరు చేసింది. ప్రభుత్వ వైద్యకళాశాలల్లో నాణ్యమైన విద్య అందుతుండగా.. నర్సింగ్ కళాశాలలకు గత విద్యాసంవత్సరమే నూతన భవనాలు మంజూరైనా ఇప్పటికీ వాటి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. అద్దె భవనాల్లోనే కాలం వెళ్లదీయాల్సి వస్తోంది. నెలనెలా అద్దెలు చెల్లించకపోవటంతో రూ.లక్షల బకాయిలు పేరుకుపోతున్నాయి.

**నత్తనడకన నిర్మాణం**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాలకు 2023-24లో ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలు మంజూరయ్యాయి. 60 చొప్పున బీఎస్సీ నర్సింగ్ సీట్లతో 120 మంది విద్యార్థులు తొలి ఏడాది చదువు పూర్తిచేసుకొని ప్రస్తుతం ద్వితీయ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నారు. 2023-24లోనే రెండుచోట్లా సొంత భవనాల నిర్మాణాలకు సర్కారు రూ.18కోట్ల చొప్పున కేటాయించింది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా తరగతి గదులు, వసతిగృహాలు, ప్రయోగశాలలు నిర్మించాలని



నిర్ణయించింది. ఖమ్మం నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి ఖమ్మం గ్రామీణం మండలం మద్దులపల్లిలో ఐదెకరాల స్థలం కేటాయించింది. నాలుగేళ్ల కోర్సుకు మొత్తమ్మీద 240 మంది విద్యార్థులకు సౌకర్యాలు ఉండాలని స్పష్టం చేసింది. సుమారు ఏడాది గడుస్తున్నా స్లాబు లెవల్ వరకు కూడా పనులు పూర్తికాలేదు. భద్రాద్రి జిల్లా పాల్వంచలో మెడికల్, నర్సింగ్ కళాశాలల నిర్మాణానికి ఒకేచోట 40 ఎకరాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. తొలుత నర్సింగ్ కళాశాల భవనాలను నిర్మించినా వాటిని వైద్యకళాశాలకు అప్పగించారు. ప్రస్తుతం నర్సింగ్ కళాశాల నిర్మాణ పనులు 70శాతం వరకు చేరాయి.

**రూ.లక్షల్లో బకాయిలు**

నూతన భవనాలు అందుబాటులోకి వచ్చే వరకు అద్దె భవనాల్లో నర్సింగ్ కళాశాలలను కొనసాగించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఉభయ జిల్లాల్లో రెండుచోట్లా అద్దె భవనాల్లో తరగతులు నిర్వహిస్తున్నారు. ఖమ్మం జిల్లా నర్సింగ్ కళాశాలను మద్దులపల్లిలోని ఓ ప్రైవేటు భవనంలో కొనసాగిస్తున్నారు. నెలకు రూ.లక్ష అద్దె చెల్లించాలి. సుమారు ఏడాదికి పైగా అద్దెలు చెల్లించకపోవటంతో బకాయిలు పేరుకుపోతున్నాయి. భద్రాద్రి జిల్లా నర్సింగ్ కళాశాలను కొత్తగూడెం రామా టాకీస్ రహదారి వెంట గల ఓ ప్రైవేట్ భవనంలో నిర్వహిస్తున్నారు. నెలకు రూ.1.20 లక్షల అద్దె చెల్లించాల్సి ఉండగా తొలి నుంచి బకాయిలు పేరుకుపోయినట్టు సమాచారం. అద్దె భవనాల్లో అరకొర వసతుల నడుమ ఇబ్బందులు పడాల్సి వస్తోందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఆగస్టు నాటికి భవనాల నిర్మాణ పనులు పూర్తిచేస్తామని తెలంగాణ వైద్యసేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) అధికారులు తెలిపారు.

# వసతుల కల్పనకు నిధులు మంజూరు

నిర్మల్ : నిరుపేదలకు రెండు పడక గదుల ఇళ్లను అందించాలని గత ప్రభుత్వం తలపెట్టింది. నియోజకవర్గాల వారీగా ఇళ్లను మంజూరు చేసింది. కానీ గుత్తేదారులు ముందుకు రాకపోవడం తో కొన్ని ఇళ్ల నిర్మాణాలు రద్దయ్యాయి. చేపట్టిన భవన నిర్మాణాలు అధిక శాతం పూర్తయ్యాయి. కానీ వాటిలో మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఇప్పటికే కేటాయించిన ఇళ్లలో అసౌకర్యాల మధ్య జీవనం సాగిస్తున్నారు. సీసీ రోడ్లు లేక వర్షాకాలం బురద నుంచి నడవాల్సిన దుస్థితి నెలకొంది. మౌలిక వసతులు కల్పించకపోవడంతో కొన్ని చోట్ల భవనాలు పూర్తయినా కేటాయింపులు జరగలేదు.

మౌలిక వసతులు కల్పించడానికి భైంసా మండలంలో 440 ఇళ్లకు రూ.2.94 కోట్లు, నిర్మల్ గ్రామీణ మండలం కౌట్ల(కె) శివారులో 600 గృహ సముదాయాలకు రూ.4.08 కోట్లు మంజూరయ్యాయి. వీటి పర్యవేక్షణ



రోడ్లు, భవనాల శాఖ అధికారులు చూస్తున్నారు. కలెక్టర్ నుంచి పరిపాలనాపరమైన అనుమతులు రాగానే టెండర్ల ప్రక్రియ చేపట్టి పనులు చేపట్టనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

**నిర్మల్ నియోజకవర్గంలో..**

నిర్మల్ పట్టణం, గ్రామీణ మండలం కౌట్ల(కె)తో పాటు సోన్, దిలావర్‌పూర్, లక్ష్మణచాంద మండలాల్లో 2,612 ఇళ్లు పూర్తి కాగా వీటిలో 2012 ఇళ్లకు మౌలిక వసతులు కల్పించారు. 600 ఇళ్లకు కల్పించాల్సి ఉంది. 69 ఇళ్ల నిర్మాణాలు ప్రగతిలో ఉన్నాయి. పట్టణంలోని మహాలక్ష్మివాడలో 1016, ఎల్లపెల్లి శివారులో 444 ఇళ్లు పంపిణీ చేశారు. అక్కడ లబ్ధిదారులు అసౌకర్యాల మధ్య కాలం వెళ్లదీస్తున్నారు. కౌట్ల(కె) గ్రామ శివారులో 600 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. వీటికి మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఇళ్లు కేటాయించలేదని అధికారులు పేర్కొన్నారు.

**ముథోల్‌లో..**

భైంసా, ముథోల్, కుభీరు, లోకేశ్వరం, బాసర, తానూరు, కుంటాల మండలాలకు 1930 ఇళ్లు మంజూరయ్యాయి. కానీ పలు కారణాలతో 856 రద్దు అయ్యాయి. 1074 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం కాగా వీటిలో 705 పూర్తయ్యాయి. 369 ఇళ్లు వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయి. వీటిలో 502 ఇళ్లు మౌలిక వసతులకు నోచుకోలేదు.

**ఖానాపూర్‌లో ..**

ఖానాపూర్, పెంబి, కడెం మండలాలకు 685 ఇళ్లు మంజూరయ్యాయి. ఇక్కడ నిర్మాణాలకు గుత్తేదారులు ముందుకు రాకపోవడం, వివిధ కారణాలతో 85 ఇళ్ల టెండర్లు రద్దు అయ్యాయి. మిగిలిన 600 ఇళ్లు పూర్తయ్యాయి. వీటిని లబ్ధిదారులకు లాటరీ పద్ధతుల్లో కేటాయించారు. 400 ఇళ్లకు వసతులు కల్పించారు. మిగిలిన 200 ఇళ్లకు తాగునీటి పైప్‌లైన్, మరుగుదొడ్ల నిర్మాణాలు, విద్యుత్తు, రోడ్లు వంటి సౌకర్యాల పనులు చేపట్టాల్సి ఉంది.

# గోదావరిలోకి దారి వేసి..ఇసుకను కాజేసి

కడెం: కడెం మండలం లింగాపూర్ గోదావరి రేవు నుంచి ఇసుకను తరలిస్తున్నారు. ఇందుకు గ్రామ కమిటీకి కొంత రుసుము చెల్లించి ఆమోదం పొందినట్లు సమాచారం. అదే అదనుగా ఇలా నేరుగా దారి వేసుకుని గోదావరి నుంచి ఇసుకను తెచ్చి ఒడ్డున కుప్పలుగా పోస్తున్నారు. ఇక్కడి నుంచి వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. కడెం మండలంలోని గోదావరి రేవుల వెంట ఇలా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నా సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఇలా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే ప్రభుత్వానికి రావాల్సిన రాయల్టీని కోల్పోయే అవకాశముంది. ఇలాంటి




అక్రమ దందాపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. కాగా ఇసుక రవాణాకు ఎవరికీ అనుమతులు లేవని, తమ సిబ్బందిని అప్రమత్తం చేశామని, దంపులు ఉంటే సీజ్ చేస్తామని, తరలిస్తే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సుజాత పేర్కొన్నారు. ట్రాక్టర్లలో ఇప్పటికి గోదావరి నదిలోకి తీసుకెళుతున్నారు చూశారా.. గ్రామంలో అయితే ఏదో దారి వేసేందుకో, ఇంటి అవసరాలకో అనుకోవచ్చు. కానీ ఏకంగా గోదావరిలోకి మట్టి ట్రాక్టర్లను ఎందుకు తీసుకెళుతున్నారంటే గోదావరిలోనూ దారి నిర్మించేందుకే. అవును గోదావరి మధ్యలో ఇసుక తెట్టెలుగా ఉంది. అక్కడి వరకు ట్రాక్టర్లు వెళ్లాలంటే మొదట దారి వేసుకోవాలి. ఇందుకు ఎవరి అనుమతి అక్కర లేదు. దర్జాగా మట్టి తరలించి గోదావరిలో దారి ఏర్పాటు చేసుకుని ఇసుకను అక్రమంగా తరలించడమే వీరి ఉద్దేశం.

# మహిళా సంఘాలకు ఇసుక క్వారీలు

ఖమ్మం : జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పరిధిలోని మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా జిల్లాలో ఇసుక క్వారీ(రీచ్)ల నిర్వహణకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడం, వ్యాపారాల్లో రాణించేలా వారిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు చేపట్టింది. మధిర నియోజకవర్గం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క.. ఇప్పటికే మహిళలు ఆర్థిక స్వయం సమృద్ధి సాధించేందుకు ఇందిరా డెయిరీ ఏర్పాటుచేసి పాడి పరిశ్రమకు ఊతం కల్పిస్తున్నారు. కలెక్టరేట్‌లో మహిళా సంఘాలకు క్యాంటీన్‌ను అధికారులు అప్పగించారు. పలు ప్రాంతాల్లో స్త్రీశక్తి టీ స్టాల్స్ ఏర్పాటు చేయించారు. ఇందులో భాగంగానే థర్డ్ ఆర్డర్ స్ట్రీమ్స్ (ఉప నదులు, వాగులు, వంకలు)లో ఇసుక రీచ్‌లు (క్వారీ) మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయించారు. మహిళా సంఘాలు ఇసుక రీచ్‌లు విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు మధిర తహసీల్దార్ రాళ్లబండి రాంబాబు తెలిపారు. గత నెలలో ఒక్కో సంఘానికి రూ.2 లక్షల చొప్పున ఆదాయం సమకూరిందని వివరించారు.

**మధిర, ఎర్రుపాలెంలో అమలు**

మధిర మండలం చిలుకూరు, బుచ్చిరెడ్డిపాలెం శివారు నక్కలగరుబు గ్రామాల్లో వైరా నదిలో, ఎర్రుపాలెం మండలంలో తక్కెళ్లపాడు, చొప్పకట్లపాలెం గ్రామాల్లో కట్టలేరులో ఇసుక క్వారీలు ఆయా గ్రామాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాలకు అప్పగించారు. రెండు నెలలుగా వీరు ఇసుక రీచ్‌లను విజయవంతంగా నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఇక్కడ ఇసుక రీచ్‌ల నిర్వహణ ఫలించడంతో మిగతా ప్రాంతాల్లోనూ మహిళా సంఘాలకు అప్పగించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ యోచిస్తున్నారు. ఉప ముఖ్యమంత్రి మల్లు



భట్టివిక్రమార్క మార్గదర్శకత్వంలో మధిర నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో ఇసుక రీచ్‌లు మహిళా సంఘాలకు అప్పగించే అవకాశం ఉంది.

**కూపన్‌పై రూ.539..**

థర్డ్ ఆర్డర్ స్ట్రీమ్స్‌లో వాల్టా చట్టం ప్రకారం ఇసుక రీచ్‌ల నిర్వహణ తహసీల్దార్ పరిధిలోకి వస్తుంది. మధిర, ఎర్రుపాలెం మండలాల్లో తహసీల్దార్లు ప్రతి కూపన్ జారీకి రూ.1,500 అధికారికంగా ఛార్జి చేస్తున్నారు. దీని ఆధారంగా సంబంధిత గ్రామ పంచాయతీ కార్యదర్శి వేబిల్ జారీ చేస్తారు. దాని ఆధారంగా ఇసుక రీచ్‌లో మహిళా సంఘాల వారు ఇసుక లోడింగ్‌కు అనుమతించి వాహనం వివరాలు రిజిస్టర్‌లో నమోదు చేస్తారు. అక్కడి నుంచి ఇసుక రవాణా అవుతుంది. ఇసుక రీచ్‌లో యంత్రాలు నిషేధం. మనుషులే ఇసుక తవ్వి ట్రాక్టర్‌లో లోడింగ్ చేస్తారు. లోడ్ చేసిన హమాలీలకు రూ.400 చెల్లిస్తారు. తహసీల్దార్ కూపన్‌కు ఛార్జి చేసిన రూ.1,500లో మహిళా సంఘానికి రూ.539, గ్రామ పంచాయతీకి అభివృద్ధికి రూ.300, హమాలీలకు రూ.400, రశీదు పుస్తకాలు ప్రింటింగ్‌కు రూ.50, పరిపాలన ఖర్చులకు రూ.50, మిగతావి గనుల శాఖకు డీఎంఎఫ్‌టీ, సీనరేజ్ ఛార్జీలు చెల్లిస్తారు.

# మారని తీరు.. అందని భగీరథ నీరు



మెట్‌పల్లి: మిషన్ భగీరథ నీటి సరఫరా సమస్య మెట్‌పల్లి మండలాన్ని వీడేలా కనిపించడం లేదు. గతంలో కూడా భగీరథ నీరు సక్రమంగా రాక పలు గ్రామాల్లో ఇబ్బందులు ఎదురయ్యాయి. ఆ సమయంలో గ్రామస్థులు పలుమార్లు ఆందోళన వ్యక్తం చేయడంతో అధికారులు సమస్యను పరిష్కరించినా మళ్లీ సమస్య పునరావృతమైంది. శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఇబ్రహీంపట్నం మండలం డబ్బా నీటి శుద్ధికేంద్రం నుంచి పల్లెల్లో ఒక్కొక్కరికి 100 లీటర్ల చొప్పున నీటిని అందించాల్సి ఉంటుంది. గతంలో జలాల్‌పూర్ ఇన్‌టెక్ వెల్ వద్ద మోటార్ల మరమ్మతు కారణంగా డబ్బా కేంద్రానికి అవసరమైనంత నీరు రాక ఇబ్బందులు ఎదురయ్యాయి. సాంకేతికంగా మెట్‌పల్లి మండలంలోని పలు గ్రామాలు ఎత్తులో ఉండడంతో డబ్బా కేంద్రానికి పూర్తిస్థాయిలో నీరు వస్తేనే ఆయా గ్రామాల ట్యాంకులకు నీరు చేరుతుంది. ప్రస్తుతం జలాల్‌పూర్ ఇన్‌టెక్ వెల్ వద్ద ఒకట్రెండు మోటార్లు మరమ్మతుకు గురైనట్లు సమాచారం. దీంతో డబ్బా కేంద్రానికి అనుకున్నంత నీరు రాక మండలంలోని పలు గ్రామాలకు నెల రోజులుగా నీటి సరఫరా జరగడం లేదు. ఆత్మకూర్, పాటిమీదితండా, కేసీఆర్ తండా, వెల్లుల్ల, రంగారావుపేట, మెట్లచిట్టాపూర్, విట్టంపేట, ఏఎస్ఆర్ తండా తదితర గ్రామాలకు భగీరథ నీరు రావడం లేదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఆయా గ్రామాల్లో పాత మంచినీటి పథకాలతో నీటిని సరఫరా చేస్తున్నారు.

దీంతో గ్రామ పంచాయతీలకు విద్యుత్తు బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. ప్రస్తుతానికి పాత మంచినీటి పథకాల్లో నీరు అందుబాటులో ఉండడంతో సరఫరాకు ఇబ్బందుల్లేకుండా ఉంది. వేసవి సమీపిస్తున్నందున భగీరథ నీరు రాకపోతే కష్టాల తప్పవని వాపోతున్నారు. భగీరథ నీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

# సీఎస్ఆర్ నిధులు... ఆధునిక సౌకర్యాలు

జిన్నారం : సీఎస్ఆర్ నిధులు గ్రామాలకు వరప్రసాదంగా మారుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు మారేందుకు దోహదపడుతున్నాయి. జిన్నారం మండలం ఖాజీపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం నిర్మిస్తున్న భవనం పూర్తయ్యే దశకు చేరింది. ఈ నెలాఖరులో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. స్థానిక పారిశ్రామికవాడలోని కెమ్‌టెక్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో దీని నిర్మాణం చేపట్టారు.

**సమస్యలు పునరావృతం కాకుండా..**

గతంలో శిథిల భవనం కావడంతో వాన కురిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఆ రోజు సెలవు ఇవ్వాల్సిన దుస్థితి. మరోవైపు ఇరుకు గదులతో పాట్లు పడక తప్పలేదు. ఈ ఇబ్బందులు తీర్చేందుకు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ఐదు తరగతి గదులు, గ్రంథాలయం, కార్యాలయానికి వేర్వేరుగా గదులు నిర్మించారు. గతంలో ఒక గదిలో రెండు తరగతుల వారిని కూర్చోబెట్టగా.. ఇప్పుడిక ఆ సమస్య ఉ




ండదు. విశాలమైన భోజనశాల సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం రంగులు వేస్తున్నారు. రూ.1.8 కోట్ల అంచనాతో నిర్మాణ పనులు చేపట్టారు.

**అంగన్‌వాడీ సైతం**

ఇదే సముదాయంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఎలాంటి అవస్థలు పడకుండా అన్ని వసతులు కల్పిసున్నారు. ప్రత్యేకంగా సామగ్రి నిల్వ కోసం ప్రత్యేకంగా గదిని నిర్మించారు. చిన్నారులకు సకల సౌకర్యాలు కల్పించారు. వారిని ఆకట్టుకునేలా కార్పోరేట్ తరహాలో గోడలపై బొమ్మలు వేయించారు.

అన్ని సదుపాయాలతో..: అన్ని వసతులతో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గతంలో ఉన్న సమస్యలు చాలా వరకు పరిష్కారం అయినట్లే. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఒనగూరనున్నాయి. అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు

# సీడీపీ నిధులేవి?

ఆదిలాబాద్ : సాధారణంగా ఎమ్మెల్యేకు ఏటా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం(సీడీపీ) కింద నిధులు విడుదలవుతాయి. గ్రామాల్లో ఇచ్చిన హామీలు.. కార్యకర్తలు సూచించిన పనులను మంజూరు చేసేందుకు ఎమ్మెల్యేలకు ఉన్న ఏకైక నిధి ఇదే. గెలుపొంది ఏడాది కావొస్తున్నా ఈ సీడీపీ నిధుల జాడ లేకపోవడంపై ఎమ్మెల్యేలు నిట్టూరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని విపక్ష ఎమ్మెల్యేల పరిస్థితి అయోమయంగా ఉందని వారి అనుచరులు వాదిస్తున్నారు. తమ వద్దకు వచ్చిన ప్రజల సమస్యలు పరిష్కరించలేకపోతున్నామని ఇటు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు గత ప్రభుత్వ హయాంలో తొలుత సీడీపీ కింద రూ.3 కోట్లకు పెంచారు. చివరి సంవత్సరం 2022-23లో ఆ నిధి ఏకంగా రూ.5 కోట్లకు పెరిగింది. నిధులు పెంచినా అందులో ఒక నిబంధనను తీసుకొచ్చారు. రూ.3 కోట్లు ఎమ్మెల్యే కోటా కింద విడుదల చేసి మిగతా వారి ప్రమేయం లేకుండానే రూ.2 కోట్లు నేరుగా ప్రభుత్వమే విద్యాశాఖ కింద 'మన ఊరు - మన బడి'కి కేటాయించింది. దీంతో కోటా పెంచినా అంతగా ప్రయోజనం లేకుండా పోయిందని అప్పట్లో కొందరు ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చారు. ఆఖరుగా 23.05.2023న జిల్లాలకు సీడీపీ కింద రూ.3 కోట్ల చొప్పున ఒక్కో నియోజకవర్గానికి విడుదలయ్యాయి. ఇది ఇంతకు ముందున్న ఎమ్మెల్యేలు వినియోగించారు. కొత్తవారికి ఇప్పటి వరకు ఏమీ రాలేదు.

**పదిలో ఆరుగురు విపక్ష ఎమ్మెల్యేలే**

గత డిసెంబరు 7న ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. తాజాగా సంవత్సరం కావొస్తోంది. సీడీపీ నిధుల జాడలేక విపక్ష ఎమ్మెల్యేలు నిరాశలో ఉన్నారు. అధికార కాంగ్రెస్‌కు సంబంధించి మంచిర్యాల, ఖానాపూర్, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ప్రేంసాగర్‌రావు, వెడ్మబొజ్జు, వివేక్, వినోద్‌లు గెలుపొందారు. బోథ్, ఆసిఫాబాద్‌లలో భారాసకు చెందిన అనిల్‌జాదవ్, కోవలక్ష్మి విజయం సాధించారు. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో భాజపా నుంచి పాయల్‌శంకర్, మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, పాల్వాయి హరీష్‌బాబులు గెలుపొందారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం ఇతర నిధులతో పనులు మంజూరు చేయించుకుంటున్నా ఆరురుగు విపక్ష ఎమ్మెల్యేలు ఉండటంతో నిధుల కేటాయింపు సమస్యగా మారింది.

**నిరాశే..**

అసలే సీడీపీ నిధుల విడుదల లేక అయోమయంగా ఉన్న విపక్ష ఎమ్మెల్యేలకు ఇతర నిధుల్లోనూ ప్రాధాన్యం లభించకపోవడం ఇబ్బందికరంగా మారింది. నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధి(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) మంజూరుకాగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట వారే పనులు ప్రతిపాదించారు. విపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట మాత్రం వారు ప్రతిపాదించిన పనులను పక్కనపెట్టడం రాజకీయ చర్చకు తెరలేపింది. ఈ పనులను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించాల్సి ఉండటంతో అన్ని చోట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు సూచించిన పనులకు అధిక ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తోంది. గెలిచిన కొత్తలో ఉపాధిహామీ కింద రోడ్లు, మురుగుకాలువల కోసం నిధులు రాగా కాంగ్రెస్ కార్యకర్తలకు కొన్ని కేటాయించి మిగతా సగం విపక్ష ఎమ్మెల్యేలకు సైతం రూ.3.50 కోట్ల చొప్పున మంత్రి కేటాయించడంతో అంతా సంతృప్తిచెందారు.

అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని మంత్రి చెప్పడంతో ఇతర నిధుల కేటాయింపుల్లోనూ ప్రాధాన్యం ఉంటుందని విపక్ష ఎమ్మెల్యేలు భావించినా ఎస్‌డీఎఫ్ పనుల్లో నిరాశే మిగలడంతో కథ మొదటికొచ్చింది. దీంతోనే సీడీపీ నిధుల విడుదలకు పట్టుబడుతు న్నారు. కేవలం కల్యాణలక్ష్మి చెక్కులు, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీకే పరిమితమవుతున్నామని విపక్ష ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక అన్ని నిధుల్లో ఎమ్మెల్యేల ప్రతిపాదనలే తీసుకోవాల్సి ఉన్నా తమ హక్కులను కాలరాస్తున్నారని విపక్ష ఎమ్మెల్యేల్లో ఒకరైన భారాసకు చెందిన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పేర్కొనడం ఇక్కడ ప్రస్తావించాల్సిన అంశం.

# చదువు 'కొనడమే'!



కరీంనగర్: బిడ్డల ఉజ్వల భవిష్యత్తే లక్ష్యంగా దిగువ మధ్య తరగతి ప్రజలు కూడా చిన్నారులను ప్రైవేటు బడుల్లో చదివిస్తున్నారు. వారి ఆకాంక్షలను ఆసరా చేసుకుని విద్యా సంస్థలు ఫీజులు ఇబ్బడిముబ్బడిగా పెంచేస్తున్నాయి. ఉన్నత, ఎగువ మధ్య తరగతి కుటుంబాలవారు ఈ భారం తట్టుకోగలుగుతున్నా.. మధ్య తరగతి, దిగువ మధ్య తరగతివారు ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతున్నా.. ఎక్కువ కుటుంబాలు తమ పిల్లలను ప్రైవేటు బాట పట్టించేందుకే మొగ్గు చూపుతున్నాయి. ప్రైవేటు బడుల్లోనూ వసతుల పరంగా లోపాలుంటున్నా.. విద్యాపరంగానూ ఇబ్బందులున్నా తల్లిదండ్రులు తమ పిల్లలను అందులో చదివించడం హోదాగా భావిస్తున్నారు. ఇదే యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచడానికి కారణమవుతున్నాయి.

రాష్ట్రంలో ఏటా ప్రభుత్వ బడుల్లో 44 శాతం విద్యార్థులు చేరుతుండగా కరీంనగర్ జిల్లాలో 35.5 శాతం, పెద్దపల్లి జిల్లాలో 46.8 శాతం, జగిత్యాలలో 51 శాతం, సిరిసిల్ల జిల్లాలో 61.2 శాతం చేరుతున్నారు. కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల్లో ప్రైవేటు సంస్థల్లోకి వెళ్లే చదువరుల సంఖ్య ఎక్కువగా ఉంది.

1994లో జారీ చేసిన జీవో ప్రకారం ప్రైవేటు బడుల్లో విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ ఉండాలి. వసూలు చేసిన రుసుముల్లో 5 శాతం యాజమాన్యం ఆదాయం కింద, 15 శాతం బడి నిర్వహణ, 15 శాతం బడి అభివృద్ధికి, 15 శాతం సిబ్బంది ప్రయోజనాలకు, మిగతా 50శాతం వేతనాలకు వెచ్చించాలి. కానీ ఎక్కడా ఇది అమలు కావట్లేదు.!

ఫీజుల నియంత్రణ విషయంలో యంత్రాంగం పర్యవేక్షణ లేకపోవడంతో యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా పెంచుకుంటున్నాయి. జగిత్యాలకు చెందిన సంతోష్ కుమార్తె ఎనిమిదో తరగతి, బాబు ఆరో తరగతి చదువుతున్నారు. మార్కెటింగ్ విభాగంలో పని చేసే ఈయన నెల జీతం రూ.18 వేలు. ఏడాదికి రూ.2.16 లక్షలు చేతికొస్తాయి. మధ్యస్తంగా ఫీజులున్న ప్రైవేటు బడిలో పిల్లలను చదివిస్తున్నారు. పాప ఫీజు రూ.40 వేలు, బాబుకు రూ.30 వేలు. ఇంకా యూనిఫాం, పుస్తకాలు, నోట్స్, ప్రాజెక్టుల కోసం మరో రూ.40 వేలు ఖర్చవుతున్నాయి. ఏడాది ఆదాయంలో 50 శాతం రూ.1.10 లక్షలు పిల్లల చదువులకే వెచ్చిస్తున్నారు.

గోదావరిఖనికి చెందిన రమేశ్‌కు పదేళ్ల కిందట రూ.10 వేలు వేతనం. ఆయన కుమారుడు రెండో తరగతి ఫీజు అప్పట్లో రూ.6 వేలు చెల్లించారు. గతేడాది కుమారుడి పదో తరగతికి రూ.42 వేలు చెల్లించాల్సి వచ్చింది. ఫీజు ఏడింతలు పెరిగింది. కానీ రమేశ్ జీతం రెండింతలు కూడా కాలేదు. ఇప్పటికీ రూ.18 వేలు మాత్రమే వస్తోంది. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆరో తరగతి చదివే విద్యార్థికి ఫీజు అక్షరాలా రూ.80 వేలు. యాక్టివిటీ ఫీజు, బస్సు ఛార్జీలు కలిపితే రూ.1.10 లక్షలు. ఉమ్మడి జిల్లాలోని కార్పొరేట్ బడుల్లో ఇష్టానుసారంగా ఫీజుల వసూలు సాగుతోంది. ఉమ్మడి జిల్లాలో చాలా బడుల్లో అయిదో తరగతి లోపు విద్యార్థులకు కనిష్ఠంగా రూ.32 వేలు గరిష్ఠంగా రూ.62 వేలు వసూలు చేస్తున్నారు. 6-10 తరగతి వరకు కనిష్ఠంగా రూ.52 వేలు గరిష్ఠంగా రూ.82 వేలు ఫీజు చెల్లించాల్సి వస్తోంది.

అడ్డగోలు ఫీజుల వసూలు వ్యవహారం తల్లిదండ్రులను ఇబ్బంది పెడుతోంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే ఏటా 10 శాతం పెంచుతున్నామని ప్రైవేటు బడుల యాజమాన్యాలు చెబుతుండగా.. ఆ స్థాయిలో వేతనాలు పెరగక మధ్య తరగతివారు.. ముఖ్యంగా ప్రైవేటు రంగంలో ఉన్నవారు అప్పులు చేస్తూ.. ఇతర అవసరాలను పక్కన పెట్టి ఫీజులు చెల్లించాల్సి వస్తోంది.

ఉమ్మడి జిల్లాలో

ప్రైవేటు విద్యా సంస్థలు:847

విద్యార్థులు : 2,12,344

# కరీంనగర్-2 డిపో ప్రైవేటు పరమేనా?



కరీంనగర్ : పర్యావరణ హితంతో పాటు ఇంధన భారం తగ్గించుకునే దిశగా ఆర్టీసీ అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా పలు రీజియన్లలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టింది. కరీంనగర్ రీజియన్ పరిధిలో కరీంనగర్-2 డిపోనకు ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించగా రోడ్లపై పరుగులు పెడుతున్నాయి. ఇప్పటికే ఇంధనంతో నడిచే అద్దె బస్సులను తీసుకోగా జేబీఎం సంస్థ ద్వారా అద్దె ప్రాతిపదికన ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టి ఆర్టీసీ బస్సులను తగ్గించుకుంటోంది. దీంతో డిపో ప్రైవేట్ పరం కానుందా లేక ఎలక్ట్రిక్ బస్సుల డిపోగా మారనుందా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కరీంనగర్-2 డిపోనకు 100 ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించారు. ఇందులో ఇప్పటికే 71 బస్సులు అందుబాటులోకి వచ్చాయి. వీటిని గతేడాది సెప్టెంబర్ 29న ప్రారంభించారు. సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్‌లను జేబీఎస్ వైపు, డీలక్స్, మరికొన్ని ఎక్స్‌ప్రెస్ బస్సులను రాజన్న సిరిసిల్ల రూట్లో తిప్పుతున్నారు. మొదట్లో 71 బస్సులు కేటాయించగా అందుకు అనుగుణంగా డిపోలో 14 ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా 11 అందుబాటులో ఉన్నాయి. కొత్తగా మరో 29 బస్సులు రానుండటంతో ఛార్జింగ్ పాయింట్లు సరిపోతాయా? లేక వాటి సంఖ్యను కూడా పెంచుతారా? చూడాల్సి ఉంది.

కరీంనగర్- 2 డిపోనకు ఎలక్ట్రిక్ బస్సులు కేటాయించడంతో ఆ డిపోలో ఉన్న బస్సులను, చోదకులను ఇతర డిపోలకు సర్దుబాటు చేశారు. డిపోలో 106 (54 ఆర్టీసీ, 52 అద్దె) బస్సులు ఉండేవి. ప్రస్తుతం వీటి సంఖ్య 69కి తగ్గింది. ఇందులో 21 ఆర్టీసీ బస్సులను రీజియన్‌లోని ఇతర డిపోలకు పంపించగా 16 అద్దె బస్సులను కరీంనగర్-1 డిపోనకు కేటాయించారు. 150 మంది చోదకులకు 78.. 154 మంది కండక్టర్లకు 137 మంది విధులు నిర్వర్తిస్తుండగా మిగిలిన డ్రైవర్లు, కండక్టర్లను ఇతర డిపోలకు కేటాయించారు. మరో 29 ఎలక్ట్రిక్ బస్సులు రానుండటంతో వాటి స్థానంలో ఆర్టీసీ బస్సులు, చోదకులు, కండక్టర్లు కూడా తగ్గే అవకాశం ఉంటుందని అంటున్నారు. ఎలక్ట్రికల్ బస్సు డిపోగా మారబోతోందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.

ఎలక్ట్రిక్ బస్సుల సంఖ్య పెరిగినా డిపో ఉంటుందని.. సిబ్బంది ఉంటారని కరీంనగర్-2 డిపో మేనేజర్ వి.మల్లయ్య తెలిపారు. ప్రైవేటుపరం ఊహాగానాలకు తావులేదని తెలిపారు. ఎలక్ట్రిక్ ఛార్జింగ్ పాయింట్ల విషయం జేబీఎం సంస్థ చూసుకుంటుందని, సంస్థ పక్షాన కండక్టర్లను మాత్రమే కేటాయిస్తామని పేర్కొన్నారు.

ఎలక్ట్రిక్ బస్సులు ఇలా..

వచ్చిన సూపర్ లగ్జరీ - 35

రానున్నవి - 5 డీలక్స్ - 6

ఎక్స్‌ప్రెస్‌లు - 30

రానున్న ఎక్స్‌ప్రెస్‌లు - 24

# ఎనిమిదేళ్లు దాటినా ఏటా కష్టాలే!

ధర్మారం : ఉమ్మడి జిల్లాలోని మెట్ట ప్రాంతాలకు నీరందించాలని శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మించినా లక్ష్యం నెరవేరడం లేదు. అందుబాటులోకి వచ్చి ఎనిమిదేళ్లు దాటినా పనులు పూర్తి కాకపోగా పైపులైన్లు, వాల్వులు దెబ్బతినడం పరిపాటిగా మారింది. నిరంతర పర్యవేక్షణ లేకపోవడం రైతులకు శాపంగా మారుతోంది.

20.175 టీఎంసీల సామర్థ్యమున్న ఎల్లంపల్లి జలాశయం ద్వారా కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, జగిత్యాల జిల్లాల్లోని 1,51,400 ఎకరాల కొత్త ఆయకట్టుకు 12 టీఎంసీల నీరందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. మంథని నియోజకవర్గంలోని గుండారం రిజర్వాయరు మీదుగా లక్కారం జలాశయం ద్వారా 7,841 ఎకరాల కొత్త ఆయకట్టు, 7 వేల ఎకరాల ఎస్సారెస్పీ ఆయకట్టు స్థిరీకరణకు 2 టీఎంసీలు కేటాయించారు. ప్రాజెక్టు రెండో దశ, ఫేజ్-1, ఒకటో ప్యాకేజీలో వేమునూరు, నందిమేడారం, గంగాధర, కొడిమ్యాల, ఎల్‌టి.పోతారం, జోగాపురం వద్ద ఆరు లిఫ్టులు ఏర్పాటు చేసి చెరువులను నింపడం ద్వారా 1.51 లక్షల ఎకరాలకు సాగునీరందించాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.



**ఇలా చేస్తే సజావుగా ఎత్తిపోతలు**

పైపులైన్లపై పోసిన మట్టిని చదును చేసి పంటలు వేస్తుండటంతో మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ఎత్తిపోతల సమయంలోనే కాకుండా ఏడాది పొడవునా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షించాలి. నీటి ఒత్తిడికి పైపులైన్లు పైకి లేవకుండా ఉండేందుకు మట్టి పోశారు. దాన్ని స్థానిక అవసరాలకు తరలించకుండా పర్యవేక్షించాలి.

**సమస్యగా భూ సేకరణ**

మంగపేట వద్ద 86 ఎకరాలకు ఇటీవల ప్రభుత్వం పరిహారం ఇచ్చింది. మరో 11 ఇళ్లకు ఇవ్వకపోవడంతో పనులు ముందుకు సాగలేదు. నారాయణపూర్ జలాశయం కట్ట దిగువన 24 ఇళ్లకు పరిహారం చెల్లింపు, కొడిమ్యాల మండలంలో 147 ఎకరాలు సేకరించాల్సి ఉంది. లచ్చపేట రిజర్వాయరుకు కాలువ ద్వారా నీటిని తరలించాల్సి ఉండగా అటవీ శాఖ భూమి అడ్డుగా ఉండటంతో పనులు ముందుకు సాగడం లేదు. దీంతో నాగారం కొత్తచెరువు, రుద్రంగి చెరువులకు నీటి తరలింపునకు అవరోధంగా మారింది. గంగాధర నుండి స్తంభంపల్లి, వేములవాడ చెరువులకు నీటిని తరలించే కుడికాలువ 19 కిలోమీటర్లకు 18 కిలోమీటర్లు తవ్వారు. మరో 1200 మీటర్లు తవ్వితే ఈ రెండు చెరువులకు నీరందుతుంది.

**తరచూ అవరోధాలు**

ఏటా యాసంగి అవసరాలకు జనవరిలో ఎత్తిపోతలు ప్రారంభించి జలాశయాలను నింపుతున్నారు. ప్రారంభానికి ముందే నందిమేడారం జలాశయం దిగువన పైపులైన్ల కిందకు నీళ్లు చేరి ఒత్తిడితో పైపులు పైకి లేవగా మరమ్మతు చేశారు. గంగాధర మండలం సర్వారెడ్డిపల్లిలోనూ ఇలాగే లేవగా సరి చేయకుంగానే ఎత్తిపోతలు చేపడుతున్నారు. 2021లో భారీ వర్షాలకు ధర్మారం మండలం కటికెనపల్లి వద్ద పైపులైన్లు దెబ్బతినడంతో మరమ్మతు చేపట్టి 2002లో రెండు నెలలు ఆలస్యంగా మార్చిలో ఎత్తిపోతలు ప్రారంభించారు. సగం పొలాలు ఎండి రైతులు పెట్టుబడి నష్టపోయారు. 2022లో భారీ వర్షాలకు నారాయణపూర్, గంగాధర చెరువులు దెబ్బతిన్నాయి. దీంతో మరమ్మతు చేపట్టి 2023 ఫిబ్రవరి 28న ఎత్తిపోతలు ప్రారంభించగా పంపుహౌస్ ప్రెషర్ మెయిన్ వాల్వు దెబ్బతిని వారం రోజులు ఆలస్యమైంది.

**ఏడాదిలోగా పనులు పూర్తి**

వేర్వేరు కారణాలతో చాలా కాలంగా పనులు జరగలేదు. ఇటీవలే మొదలయ్యాయి. అటవీ శాఖ భూములు అడ్డుగా ఉండటంతో భూ సేకరణ ఆలస్యమవుతోంది. ఏడాదిలోగా పనులన్నీ పూర్తవుతాయి. వచ్చే ఏడాది నుంచి పూర్తి స్థాయిలో ఆయకట్టుకు నీరందించే లక్ష్యంతో పనులు చేయిస్తున్నాం. సత్యప్రకాష్, నీటిపారుదల శాఖ ఈఈ

# అంగన్‌వాడీలకు విద్యుత్తు వెలుగులు

పాల్వంచ : అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యుత్తు వెలుగులు ప్రసరించను న్నాయి. కలెక్టర్ జితేశ్ వి.పాటిల్ చొరవ తీసుకోవడంతో చిన్నారులు, టీచర్లకు విద్యుత్తు సమస్యలు తీరనున్నాయి. కొత్త భవనాలతో పాటు అద్దె భవనాల్లో సైతం విద్యుత్తు కనెక్షన్లు ఇవ్వనున్నారు. ఇప్పటికే గుర్తించిన అంగన్‌వాడీ కేంద్రాలకు విద్యుత్తు మీటర్లను సరఫరా చేశారు. జిల్లా వ్యాప్తంగా 2,060 అంగన్‌వాడీ కేంద్రాలు నిర్వహణలో ఉన్నాయి. వీటిలో 952 కేంద్రాలకు విద్యుత్తు సదుపాయం లేకపోవడంతో చీకట్లో మగ్గుతున్నాయి. వేసవిలో ఉక్కపోతతోనే కాలం



వెళ్లదీయాల్సి వచ్చేది. అలాంటి సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభించనుంది.

**క్షేత్ర స్థాయిలో గుర్తించి..**వివిధ కేంద్రాల్లో విద్యుత్తు సరఫరా లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కలెక్టర్ క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లిన సందర్భాల్లో కేంద్రాల్లో చీకట్లోనే చిన్నారులకు బోధన సాగిస్తుండటాన్ని గమనించారు. ఇలాంటి సమస్యలకు చెక్ పెట్టాలని భావించి ఒక్కో కేంద్రానికి రూ.2,700 చొప్పున మొత్తం రూ.23 లక్షలతో కొత్త మీటర్లకు నిధులు విడుదల చేశారు. సంబంధిత ప్రాజెక్టు అధికారులకు సమాచారం అందజేసి ప్రాజెక్టుల వారీగా విద్యుత్తు కనెక్షన్లు లేని సమాచారం సేకరించి మీటర్లు మంజూరు చేశారు. ఇప్పటికే విద్యుత్తు మీటర్లను పంపిణీ చేయగా.. వాటికి కావాల్సిన తీగలు, స్విచ్‌బోర్డు, ఇతర పనులు చేపట్టాల్సి ఉంది.

జిల్లాలోని పదకొండు ప్రాజెక్టుల వారీగా విద్యుత్తు కనెక్షన్లు లేని అంగన్‌వాడీ కేంద్రాలను గుర్తించి మీటర్లు అందజేశాం. కొత్త కనెక్షన్లు అమర్చటానికి, గ్రామాల్లో పంచాయతీ, పట్టణాల్లో పురపాలిక అధికారులు విద్యుత్తు మరమ్మతులు చేసేలా ఆదేశాలు జారీ అయ్యాయి.

# సీఎస్ఆర్ నిధులు... ఆధునిక సౌకర్యాలు

జిన్నారం : సీఎస్ఆర్ నిధులు గ్రామాలకు వరప్రసాదంగా మారుతున్నాయి. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు మారేందుకు దోహదపడుతున్నాయి. జిన్నారం మండలం ఖాజీపల్లిలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల కోసం నిర్మిస్తున్న భవనం పూర్తయ్యే దశకు చేరింది. ఈ నెలాఖరులో ప్రారంభోత్సవానికి సిద్ధం చేస్తున్నారు. స్థానిక పారిశ్రామికవాడలోని కెమ్‌టెక్ పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో దీని నిర్మాణం చేపట్టారు.

**సమస్యలు పునరావృతం కాకుండా..**

గతంలో శిథిల భవనం కావడంతో వాన కురిస్తే విద్యార్థులు ఇబ్బందులు పడేవారు. ఆ రోజు సెలవు ఇవ్వాల్సిన దుస్థితి. మరోవైపు ఇరుకు గదులతో పాట్లు పడక తప్పలేదు. ఈ ఇబ్బందులు తీర్చేందుకు కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు. ఐదు తరగతి గదులు, గ్రంథాలయం, కార్యాలయానికి వేర్వేరుగా గదులు నిర్మించారు. గతంలో ఒక గదిలో రెండు తరగతుల వారిని కూర్చోబెట్టేవారు.. ఇప్పుడిక ఆ సమస్య ఉ



ండదు. విశాలమైన భోజనశాల సైతం అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ప్రస్తుతం రంగులు వేస్తున్నారు. రూ.1.8 కోట్ల అంచనాతో నిర్మాణ పనులు చేపట్టారు.

**అంగన్‌వాడీ సైతం**

ఇదే సముదాయంలో అంగన్‌వాడీ భవనాన్ని నిర్మించారు. చిన్నారులు, బాలింతలు, గర్భిణులు ఎలాంటి అవస్థలు పడకుండా అన్ని వసతులు కల్పిస్తున్నారు. ప్రత్యేకంగా సామగ్రి నిల్వ కోసం ప్రత్యేకంగా గదిని నిర్మించారు. చిన్నారులకు సకల సౌకర్యాలు కల్పించారు. వారిని ఆకట్టుకునేలా కార్పొరేట్ తరహాలో గోడలపై బొమ్మలు వేయించారు.

**అన్ని సదుపాయాలతో..:** అన్ని వసతులతో భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గతంలో ఉన్న సమస్యలు చాలా వరకు పరిష్కారం అయినట్లే. విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఒనగూరనున్నాయి. అనిల్‌కుమార్, ప్రధానోపాధ్యాయుడు

# సీడీపీ నిధులేవి?

ఆదిలాబాద్ : సాధారణంగా ఎమ్మెల్యేకు ఏటా నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమం(సీడీపీ) కింద నిధులు విడుదలవుతాయి. గ్రామాల్లో ఇచ్చిన హామీలు.. కార్యకర్తలు సూచించిన పనులను మంజూరు చేసేందుకు ఎమ్మెల్యేకు ఉన్న ఏకైక నిధి ఇదే. గెలుపొంది ఏడాది కావొస్తున్నా ఈ సీడీపీ నిధుల జాడ లేకపోవడంపై ఎమ్మెల్యేలు నిట్టూరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలోని విపక్ష ఎమ్మెల్యేల పరిస్థితి అయోమయంగా ఉండగా వారి అనుచరులు వాపోతున్నారు. తమ వద్దకు వచ్చిన ప్రజల సమస్యలు పరిష్కరించలేకపోతున్నామని ఇటు ఎమ్మెల్యేలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు గత ప్రభుత్వ హయాంలో తొలుత సీడీపీ కింద రూ.3 కోట్లకు పెంచారు. చివరి సంవత్సరం 2022-23లో ఆ నిధి ఏకంగా రూ.5 కోట్లకు పెరిగింది. నిధులు పెంచినా అందులో ఒక నిబంధనను తీసుకొచ్చారు. రూ.3 కోట్లు ఎమ్మెల్యే కోటా కింద విడుదల చేసి మిగతా వారి ప్రమేయం లేకుండానే రూ.2 కోట్లు నేరుగా ప్రభుత్వం కింద 'మన ఊరు – మన బడి'కి కేటాయించింది. దీంతో కోటా పెంచినా అంతగా ప్రయోజనం లేకుండా పోయిందని అప్పట్లో కొందరు ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చారు. ఆఖరుగా 23.05.2023న జిల్లాకు సీడీపీ కింద రూ.3 కోట్ల చొప్పున ఒక్కో నియోజకవర్గానికి విడుదలయ్యాయి. ఇది ఇంతకు ముందున్న ఎమ్మెల్యేలు వినియోగించారు. కొత్తవారికి ఇప్పటి వరకు ఏమీ రాలేదు.

**పదిలో ఆరుగురు విపక్ష ఎమ్మెల్యేలే**

గత డిసెంబరు 7న ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేశారు. తాజాగా సంవత్సరం కావొస్తోంది. సీడీపీ నిధుల జాడలేక విపక్ష ఎమ్మెల్యేలు నిరాశలో ఉన్నారు. అధికార కాంగ్రెస్‌కు సంబంధించి మంచిర్యాల, ఖానాపూర్, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాల్లో ప్రేంసాగర్‌రావు, వెడ్మబొజ్జు, వివేక్, వినోద్‌లు గెలుపొందారు. బోథ్, ఆసిఫాబాద్‌లలో భారాసకు చెందిన అనిల్‌జాదవ్, కోవలక్ష్మి విజయం సాధించారు. ఆదిలాబాద్, నిర్మల్, ముథోల్, సిర్పూర్ నియోజకవర్గాల్లో భాజపా నుంచి పాయల్‌శంకర్, మహేశ్వర్‌రెడ్డి, రామారావుపటేల్, పాల్వాయి హరీష్‌బాబులు గెలుపొందారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రం ఇతర నిధులతో పనులు మంజూరు చేయించుకుంటున్నా ఆరుగురు విపక్ష ఎమ్మెల్యేలు ఉండటంతో నిధుల కేటాయింపు సమస్యగా మారింది.

**నిరాశ..**

అసలే సీడీపీ నిధులు విడుదల లేక అయోమయంగా ఉన్న విపక్ష ఎమ్మెల్యేలకు ఇతర నిధుల్లోనూ ప్రాధాన్యం లభించకపోవడం ఇబ్బందికరంగా మారింది. నియోజకవర్గానికి రూ.10 కోట్ల చొప్పున ప్రత్యేక అభివృద్ధి నిధి(స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్) మంజూరుకాగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నచోట వారే పనులు ప్రతిపాదించారు. విపక్ష ఎమ్మెల్యేలు ఉన్నచోట మాత్రం వారు ప్రతిపాదించిన పనులను పక్కనపెట్టడం రాజకీయ చర్చకు తెరలేపింది. ఈ పనులను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదించాల్సి ఉండటంతో అన్ని చోట్ల నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌ఛార్జులు సూచించిన పనులకు అధిక ప్రాధాన్యమిచ్చినట్లు తెలుస్తోంది. గెలిచిన కొత్తలో ఉపాధిహామీ కింద రోడ్లు, మురుగుకాలువల కోసం నిధులు రాగా కాంగ్రెస్ కార్యకర్తలకు కొన్ని కేటాయించి మిగతా సగం విపక్ష ఎమ్మెల్యేలకు సైతం రూ.3.50 కోట్ల చొప్పున మంత్రి కేటాయించడంతో అంతా సంతృప్తిచెందారు.

అభివృద్ధి కోసం కలిసి పనిచేద్దామని మంత్రి చెప్పడంతో ఇతర నిధుల కేటాయింపుల్లోనూ ప్రాధాన్యం ఉంటుందని విపక్ష ఎమ్మెల్యేలు భావించినా ఎస్‌డీఎఫ్ పనుల్లో నిరాశే మిగలడంతో కథ మొదటికొచ్చింది. దీంతోనే సీడీపీ నిధుల విడుదలకు పట్టుబడుతున్నారు. కేవలం కల్యాణలక్ష్మి చెక్కులు, సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీకే పరిమితమవుతున్నామని విపక్ష ఎమ్మెల్యేలు ఆవేదన వెలిబుచ్చుతున్నారు. ప్రస్తుతం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు లేక అన్ని నిధుల్లో ఎమ్మెల్యేల ప్రతిపాదనలే తీసుకోవాల్సి ఉన్నా తమ హక్కులను కాలరాస్తున్నారని విపక్ష ఎమ్మెల్యేల్లో ఒకరైన భారాసకు చెందిన బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ పేర్కొనడం ఇక్కడ ప్రస్తావించాల్సిన అంశం.

# నవోదయం.. విద్యార్థులకు ఉషోదయం




సంగారెడ్డి : నాణ్యమైన విద్య, సామాజిక అంశాలపై అవగాహన, మానవీయ విలువలు, ప్రమాణాలు పెంచడంతో పాటు తదితర అంశాల్లో తీర్చిదిద్దడం నవోదయ విద్యాలయాల ప్రత్యేకత. గ్రామీణ, పేద, మధ్యతరగతి విద్యార్థులకు అత్యున్నత విద్య అందించాలన్న సదుద్దేశంతో కేంద్ర విద్యాశాఖ వీటిని నిర్వహిస్తోంది. ఇక్కడ చదువుకున్న వారెంతో మంది ఉన్నత స్థానాలకు చేరారు. ఇలాంటి ప్రతిష్ఠాత్మక విద్యాలయం ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన గతంలో కేటాయించగా, ప్రస్తుత సిద్దిపేట జిల్లా వర్గల్‌లో కొనసాగుతోంది. తాజాగా సంగారెడ్డి జిల్లాకు కేటాయిస్తూ కేంద్రం ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

నవోదయ పాఠశాలలో 6 నుంచి ఇంటర్ వరకు బోధిస్తారు. ప్రతి ఏటా 6వ తరగతిలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేస్తారు. ఒక్కో సెక్షన్‌లో 40 మంది చదువుకుంటున్నారు. ప్రస్తుతం సంగారెడ్డికి మంజూరైన విద్యాలయం 2025-26 విద్యాసంవత్సరం నుంచి ప్రారంభం అయ్యే అవకాశం ఉందని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

**క్రీడల్లో ప్రత్యేకంగా..**

ఈ విద్యాలయంలో చదువుతో పాటు క్రీడలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తారు. నిత్యం రెండు గంటల పాటు ఆటలపై సాధన చేయిస్తారు. ప్రతి ఏటా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రత్యేకంగా పోటీలు నిర్వహించి అన్ని రకాలుగా ప్రోత్సహిస్తున్నారు. దేశంలో ఏ నవోదయ విద్యాలయంలో పోటీలు జరిగినా తీసుకెళ్లి భాగస్వాములను చేస్తుంటారు. మరోవైపు సాంస్కృతిక అంశాల్లోనూ శిక్షణ ఇవ్వడం మరో ప్రత్యేకత. ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపి పిల్లలకు ఇష్టమైన అంశాల్లో తర్ఫీదు ఇస్తుంటారు. బోధకులకు బడి ఆవరణలో నివాస సముదాయం ఉండటం వల్ల రాత్రి వేళల్లో కూడా ప్రత్యేక శ్రద్ధ చూపవచ్చు.

**ఉత్తర భారతానికి..**

8వ తరగతి పూర్తయ్యాక 9వ తరగతి ఉత్తర భారతదేశంలోని ఏదో ఓ రాష్ట్రానికి పంపించి అక్కడ చదివిస్తారు. దీనివల్ల అక్కడి సంస్కృతి, సంప్రదాయం కూడా తెలుస్తుందన్నదే దీని వెనుక ఉన్న ఉద్దేశం. తిరిగి పదో తరగతిలో యథాస్థానానికి తీసుకొచ్చి చదివిస్తారు. ఇంటర్‌లో ఎంపీసీ, బైపీసీ, హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సులు సైతం అందుబాటులో ఉంటాయి.

**నెరవేరిన కల**

సంగారెడ్డి జిల్లాలో నవోదయ పాఠశాల ఏర్పాటు చేయాలని దశాబ్దాలుగా డిమాండ్ ఉంది. ఉమ్మడి జిల్లాలో వర్గల్ ఒక్క చోటే ఉండటంతో ఈ ప్రాంతంలోనూ నెలకొల్పాలని విన్నవించారు. గతంలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు కేంద్ర ప్రభుత్వ అధికారులకు, మంత్రులకు విన్నవించారు. ఎట్టకేలకు కేంద్రం నవోదయ మంజూరు చేయడంతో ఈ ప్రాంతవాసుల కల నెరవేరింది. ఇందులో గ్రామీణ ప్రాంతం వారికి 25 శాతం సీట్లు కేటాయిస్తారు. ప్రస్తుతం అనువైన స్థలం కోసం విద్యాశాఖ అధికారులు అన్వేషిస్తున్నారు. ఇప్పటికే స్థల సేకరణ షురూ చేశారు.

**ఎన్నో ప్రత్యేకతలతో..**

ఉమ్మడి మెదక్ ప్రాతిపదికన వర్గల్‌లో 1987లో దీన్ని నెలకొల్పారు. అకాడమీ బ్లాక్, అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, బాలబాలికలకు వేర్వేరుగా డార్మిటరీలు, భోజనశాల, బోధన బోధనేతర సిబ్బందికి క్వార్టర్లు, క్రీడా మైదానం, మెడికల్ అసిస్టెంట్ విభాగం ఇలా ఎన్నో వసతులు ఇక్కడ కల్పించారు. పచ్చందాల మధ్య పాఠశాల కొనసాగుతోంది. పిల్లల సర్వతోముఖాభివృద్ధికి అన్ని రకాల కృషి చేస్తున్నారు. అత్యుత్తమైన 400 మీ. ట్రాక్ ఉన్న స్టేడియం, వాలీబాల్, బాస్కెట్‌బాల్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో కోర్టులతోపాటు జిమ్ సైతం ఉంది. ఏటా 80 మంది బాలబాలికలకు ఆరో తరగతిలో ప్రవేశం కల్పిస్తున్నారు. విద్యార్థుల్లో జాతీయ సమైక్యత భావం పెంచేందుకు మైగ్రేషన్ విధానం అమలుచేస్తున్నారు. ప్రస్తుతం 21 మంది హరియాణాలోని హిసర్ నవోదయలో 9వ తరగతి చదువుతున్నారు. ఇక్కడ 460 మంది విద్యార్థులున్నారు.

**నాణ్యమైన బోధన: వెంకటేశ్వర్లు, సంగారెడ్డి డీఈవో**

జిల్లాకు నవోదయ పాఠశాల మంజూరు చేస్తూ ఉత్తర్వులు వచ్చాయి. సంబంధిత నివేదిక అందాక పూర్తి వివరాలు తెలుస్తాయి. స్థల సేకరణ నిమిత్తం కలెక్టర్‌కు లేఖ రాస్తాం. నవోదయలో సీబీఎస్ఈ విధానంలో బోధన జరుగుతుంది. నాణ్యమైన బోధన అందుతుంది. జిల్లావిద్యార్థులకు ఎన్నో ప్రయోజనాలున్నాయి.

# మేమింతే.. ఎవరి మాట వినం



ఆదిలాబాద్ : జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో పూర్తిగా ధ్వంసమైన లారీ ముందు భాగం, ఇందులో డ్రైవర్ మృత్యువాత పడ్డాడురహదారి ప్రమాదాలపై 'నేనూ బాధితుడినే' అంటూ లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, సుబ్రహ్మణ్య జైశంకర్‌లు వ్యాఖ్యానించటాన్ని పరిశీలిస్తే పరిస్థితి ఎంత ఆందోళనకరంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వాహన ప్రమాదాలకు అధ్వాన రహదారులు ఒక కారణమైతే.. అడుగడుగునా నిబంధనలను ఉల్లంఘించడం రెండో కారణంగా నిలుస్తోంది. దేశవ్యాప్తంగా రహదారి నిబంధనల ఉల్లంఘన సర్వసాధారణమవుతోంది. ప్రమాద బాధిత కుటుంబాలు ఆర్థికంగా చితికిపోతున్నాయి.

**ప్రాణం కాపాడిన శిరస్త్రాణం**

విద్యుత్తు శాఖలో ఉద్యోగి నజీర్ బేగ్ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే ప్రయత్నంలో ప్రమాదానికి గురయ్యాడు. కింద పడిపోయిన ఆయన తల వేగంగా వెళ్లి పక్కనున్న రాయికి తగిలింది. శిరస్త్రాణం ఉండటంతో చిన్న గాయాలతో బయటపడ్డారు.

**చిన్న ప్రమాదం.. రూ.7 లక్షల ఖర్చు**

ఇంద్రవెల్లి మండలం గౌరాపూర్‌కు చెందిన సంగెపు బొర్రన్న రెండేళ్ల కిందట ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రెండు భారీ వాహనాలు ఒకదాన్ని మరొకటి ఓవర్‌టేక్ చేసేక్రమంలో ప్రమాదానికి గురయ్యారు. తీవ్ర గాయాలయ్యాయి. భుజం వద్ద నరం దెబ్బతింది. చికిత్సకు ఇప్పటి వరకు రూ.7 లక్షలు ఖర్చు చేశారు. ప్రస్తుతం ఇంకా ఫిజియోథెరపీ చేయించుకుంటున్నారు.

**పిల్లలు అనుసరిస్తారు**

వాహనాలు నడిపేటప్పుడు రెడ్ సిగ్నల్ దాటడం, యూటర్న్ దూరంగా ఉందని అపసవ్య దిశలో వెళ్లడం, ఫోన్‌లో మాట్లాడుతూ తల్లిదండ్రులు నడిపితే.. పిల్లలూ అదే విధంగా ప్రవరిస్తారు. ప్రమాదాల బారిన పడతారు.

**అవగాహన కరవు..**

చాలా మందికి డ్రైవింగ్ లైసెన్సు ఉంటుంది. కానీ రోడ్డు భద్రతపై కనీస అవగాహన ఉండదు. పిల్లలకు పాఠశాలల్లో రహదారి నిబంధనలపై అవగాహన కల్పించటానికి వారానికో పీరియడ్‌ను కేటాయించాలి. స్వచ్ఛంద సంస్థలు, ట్రాఫిక్ పోలీసులు తరచూ అవగాహన కల్పిస్తే మార్పు వస్తుంది.

ఈ అమ్మ ఆదర్శంఆదిలాబాద్ పట్టణంలోని ఒక తల్లి పాఠశాలకు కుమారుడిని తీసుకెళ్లి, తీసుకొచ్చేటప్పుడు తాను శిరస్త్రాణం ధరిస్తూ కుమారుడికి సైతం పెట్టి ఆదర్శంగా నిలుస్తోంది. అంతా ఇలా పాటిస్తే ప్రమాదాల్లో ప్రాణాపాయం తప్పించుకోవచ్చు.

**చితికిపోతున్న కుటుంబాలు**

శిరస్త్రాణం ఉండదు.. అపసవ్య దిశలో ప్రయాణించటం, మద్యం తాగి నడపడం, అతి వేగం, చరవాణిలో మాట్లాడటం, ముందున్న వాహనాన్ని నిబంధనలు విస్మరించి ఓవర్‌టేక్ చేయటానికి యత్నించటంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. విలువైన ప్రాణాలు గాలిలో కలిసి వారిపై ఆధార పడ్డ కుటుంబాలు ఛిన్నాభిన్నం అవుతున్నాయి. ప్రమాదంలో గాయాలతో బయటపడినా చికిత్సలకు రూ.లక్షల్లో వెచ్చించి ఆర్థికంగా నష్టపోతున్నారు. వాహనాలు నడిపే ప్రతి వంద మందిలో 40 మంది ఏదో ఒక సందర్భంలో చిన్నదో, పెద్దదో ప్రమాదం బారిన పడిన వారే ఉంటున్నారు.

నేనూ బాధితుడినే.. చట్టాలంటే ప్రజలకు భయం లేదు

'దేశంలో రోడ్డు ప్రమాదాల కారణంగా నిత్యం ఎంతో మంది ప్రాణాలను కోల్పోతున్నారు. ఈ ఘటనలు తగ్గించటానికి ప్రభుత్వం నిరంతరంగా కృషి చేస్తూనే ఉంది. ప్రజల నిర్లక్ష్యం వల్ల బాధితులు పెరిగిపోతూనే ఉన్నారు. నేనూ బాధితుడినే. చట్టాలంటే ప్రజలకు భయం, భక్తి లేకుండాపోయింది. రెడ్‌సిగ్నల్ పడితే ఆగరు. శిరస్త్రాణం ధరించరు. నా కళ్ల ముందే ఒక కారు నిబంధనలను విస్మరించి రెడ్ సిగ్నల్ దాటుకొని వెళ్లిపోయింది.' లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా కేంద్ర రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలు.

# వాహనాలు మూలకు.. కదలని చెత్త

మంచిర్యాల : మంచిర్యాల పురపాలక సంఘంలో చెత్త తరలించే వాహనాల నిర్వహణ అధికారులు నిర్లక్ష్యంతో గాడితప్పింది. మరమ్మతులకు గురైన ట్రాక్టర్లు, ఆటో ట్రాలీలు గ్యారేజీకే పరిమితం అవుతున్నాయి. ఇప్పటికే మూడు ఆటో ట్రాలీలు, ఒక ట్రాక్టర్, ఒక బ్లేడ్ ట్రాక్టర్, స్వీపింగ్ వాహనం పనిచేయడం లేదు.

ఫలితంగా వీధుల్లో ఎక్కడి చెత్త కుప్పలు అక్కడే పడిఉన్నాయి. మరికొన్ని ట్రాక్టర్లకు వెనుక భాగంలో పరికరాలు ఊడిపోయాయి. చెత్త తరలించేటప్పుడు రహదారిపై వెళ్లే వాహనదారులపై పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. మున్సిపల్ కార్యాలయంలో పరిశుభ్రత పనులు చేయడానికి 34మంది శాశ్వత, 260 మంది ఒప్పంద కార్మికులు పనిచేస్తున్నారు. పట్టణంలోని 36 వార్డుల్లో రోజుకు 44 మెట్రిక్ టన్నుల చెత్త వెలువడుతోంది. ఇందులో రోజుకు 42 మెట్రిక్ టన్నులు తొలగిస్తున్నారు. చెత్త తరలించడానికి ఒక్కో వార్డుకు ఒక్కో ఆటోట్రాలీ కేటాయించారు. షాపింగ్ ఏరియా, పెద్ద కాలనీలు ఉన్న వార్డులో రెండు వాహనాలు కేటాయించారు. రెండు మూడు వార్డులకు కలిపి ఒక ట్రాక్టర్ కేటాయించారు. ఇప్పుడు అయిదు వాహనాలు మరమ్మతులకు గురికావడంతో ఆ వార్డుల్లో చెత్త కుప్పలు పెరిగిపోతున్నాయి. అన్ని వాహనాలు నడిచినప్పుడే పట్టణంలో పూర్తి స్థాయిలో చెత్త శుభ్రం చేయడంలో విఫలమయ్యారు. పారిశుద్ధ్య పనులు పర్యవేక్షించడానికి ఇక్కడ ఒక సూపర్‌వైజర్, ఇద్దరు పారిశుద్ధ్య విభాగం ఇన్‌ఛార్జి అధికారులు ఉన్నారు. వీరి మధ్య సమన్వయ లోపంతో పరిశుభ్రత పనులపై పట్టించుకోవడం లేదని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. పట్టణంలోని ప్రధాన వీధుల్లో నిత్యం వాహనాల రాకపోకలు సాగించడంతో ఆ రహదారులకు ఇరుపక్కల దుమ్ము పేరుకుపోయింది. దీన్ని శుభ్రం చేయడానికి ఉపయోగించే బ్లేడ్ ట్రాక్టర్, స్వీపింగ్ వాహనం పనిచేయడం లేదు. రహదారులపై ఉన్న ఇసుక దుమ్ముతో వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు.

# అటు మబ్బులు.. ఇటు కుప్పలు..

మంచిర్యాల : పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి అన్నదాతలకు అగచాట్లు తప్పడం లేదు. తేమ పేరుతో మిల్లర్లు ధాన్యం మిల్లుల్లో దించుకోవడానికి కొర్రీలు పెట్టడంతో కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. దీనికి తోడు వాతావరణలో మబ్బులు రావడంతో పాటు అక్కడక్కడ పడుతున్న వర్షాలతో అవస్థలు తప్పడం లేదు. వారం రోజులుగా ఆకాశంలో వస్తున్న మబ్బులతో రైతులు గుండెల్లో గుబులు రేపుతోంది. రోజుల తరబడి ధాన్యం కుప్పల దగ్గరే పడిగాపులు కాయాల్సి వస్తోంది. వాతావరణం చల్లగా ఉండి మబ్బులు రావడంతో తేమ రావడం లేదని ధాన్యం కొనుగోళ్లు ఆలస్యంగా జరుగుతుండటం రైతులకు ఇబ్బందిగా మారింది. మరోవైపు సన్న వరి ధాన్యం కొనేందుకు ఈసారి వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

**సన్నాలు కొనేవారేరి..?**

రెబ్బనపల్లి సమీపంలో సన్న రకం ధాన్యం కుప్పలు పోసి వీటిపై కవర్లు కప్పారు. ప్రభుత్వం దొడ్డు రకాలతోపాటు ఎంపిక చేసిన కొన్ని రకాల సన్నాలు మాత్రమే కొనుగోలు చేస్తోంది. ఇతర సన్నాలను వ్యాపారులకు అమ్ముకోవాల్సిన పరిస్థితి. వాతావరణంలో మార్పులతో కొనడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. గతేడాది ఇదే సమయంలో సన్నాలకు వ్యాపారులు క్వింటాలుకు రూ. 3 వేల వరకు చెల్లించారు. కానీ ఈసారి రూ. 2800, రూ. 2850 ధరతో కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. దీంతో సన్నాలు సాగు చేసిన రైతులు కుప్పలు పోసి 15 నుంచి 20 రోజులు గడుస్తున్నా వీటిని



కొనేవారు లేక పడిగాపులు కాస్తున్నారు. దండేపల్లి మండలం నెల్కివెంకటాపూర్‌లో ఒకేచోట 20 మంది రైతులు ధాన్యం అమ్మేందుకు ఇక్కడే కుప్పలు పోశారు. వారం రోజులుగా వాతావరణంలో వస్తున్న మబ్బులు, చిరుజల్లులకు ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతున్నాయి. వర్షం పడటంతో చాలా చోట్ల ధాన్యం తడిసిపోయింది. శనివారం ఉదయం నుంచి రైతులు ధాన్యాన్ని ఆరబోస్తూ ఎన్నో ఇబ్బందులు పడ్డారు. మళ్లీ మబ్బులు రావడంతో సాయంత్రం ధాన్యాన్ని రక్షించుకునేందుకు కుప్ప చేస్తూ పడుతున్న ఇబ్బందులు వర్ణనాతీతం..

**కుప్ప పోసి 20 రోజులవుతోంది..**మేకల తిరుపతి, రైతు, రెబ్బనపల్లి

నేను పది ఎకరాల్లో సన్న రకం వరి సాగు చేశాను. 20 రోజుల కిందటే ధాన్యం చేతికొచ్చింది. కానీ ఇప్పటివరకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. క్వింటాలుకు రూ. 2800 మాత్రమే అంటున్నారు. ఇదే ధరకు అమ్మితే గిట్టుబాటు కాదు.. వ్యాపారులు ధర చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

**రోజూ కుప్ప చేయడం.. ఆరబోయడంతోనే సరిపోతోంది**

ఇండ్ల ఆత్మారావు, రెబ్బోనపల్లి

వారం రోజులుగా మబ్బులు రావడంతో ధాన్యాన్ని కాపాడుకునేందుకు పొద్దంతా ఆరబోయడం, సాయంత్రం కుప్ప పోసి కవర్లు కప్పాల్సి వస్తోంది. కవర్లకే రోజుకు రూ. వంద అద్దె అవుతోంది. తేమ రావడం లేదంటూ కొనడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. వెంటనే కొనుగోళ్లు జరిగేలా చూడాలి.

# అర్హుల నిర్ధారణకు ఇంటింటి సర్వే

నిజామాబాద్ : ఇందిరమ్మ ఇళ్ల పథకానికి జిల్లాలో అర్హుల ఎంపికకు కసరత్తు మొదలైంది. పథకం అమలుకు సర్కారు ఇప్పటికే యాప్ తెచ్చింది. ప్రజాపాలన దరఖాస్తుల వివరాలు అందులో పొందుపర్చారు. 360 డిగ్రీ సాఫ్ట్‌వేర్‌లో తప్పుడు వివరాలు సరిచూడటం కూడా పూర్తయింది. జిల్లాలో 3.42 లక్షల దరఖాస్తులు రాగా.. ఇప్పుడు 2.34 లక్షలే అర్హమైనవిగా తేలాయి. అయినప్పటికీ అర్హులను తేల్చేందుకు ఇంటింటి సర్వే చేసేందుకు రెండు అంచెల్లో శిక్షణ ఇచ్చారు. క్షేత్రస్థాయి పరిశీలించి యాప్‌లో వివరాలను నిర్ధారించాల్సి ఉంటుంది.

**సర్వే బృందాలకు శిక్షణ:** సర్వే బాధ్యతలు ప్రభుత్వ సిబ్బందే చూడనున్నారు. గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, మున్సిపాలిటీల్లో వార్డు అధికారులైన జూనియర్ అసిస్టెంట్లు, బిల్ కలెక్టర్లు, ఇతర విభాగాల సిబ్బంది ఉంటారు. వీరికి ఇప్పటికే నిబంధనలు, సూచనలు చేశారు. ఇందుకు భిన్నంగా ఎంపికలు చేస్తే సదరు ఉద్యోగులనే బాధ్యులను చేస్తామని అధికారులు హెచ్చరించారు. ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పర్యవేక్షిస్తారు.

**మూడు చిత్రాలు తీస్తారు..:** దరఖాస్తుదారు ప్రస్తుతం ఉంటున్న ఇంటి ఎదుట నిల్చోబెట్టి ఒకటి, ఇల్లు కనిపించేలా మరొకటి, ఖాళీ స్థలం చిత్రం నమోదు చేస్తారు. ఇప్పటికే ఇళ్లు కట్టుకున్న వారు చాలా మంది దరఖాస్తు చేశారు. వారి వివరాల నమోదులో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వీరికి పథకం వర్తించదని చెబుతున్నారు. ఖాళీ స్థలానికి జియోట్యాగింగ్ చేస్తారు. కొత్తగా కట్టనున్న ఇంటికే నాలుగు దశల్లో రూ.5 లక్షలు మంజూరు చేయనున్నారు. పూరిగుడిసెలు, శిథిలావస్థ ఇళ్లల్లో ఉంటున్న వారికి తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు.

**పైలెట్ ప్రాజెక్టు సర్వే పూర్తి..:** పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైన జక్రాన్‌పల్లి మండలం మాదాపూర్, ఆర్మూర్ బల్దియాలో 23వ వార్డులో సర్వే పూర్తయింది. మాదాపూర్‌కు సంబంధించి యాప్‌లో 129 మంది వివరాలున్నాయి. 360 డిగ్రీ సాఫ్ట్‌వేర్‌తో పరిశీలిస్తే 84 మంది అర్హులు ఉండగా, క్షేత్రస్థాయి సర్వేలో 77 మంది తేలారు. పైలెట్ ప్రాజెక్టు సర్వే సందర్భంగా యాప్‌లో గుర్తించిన పొరపాట్లు సరిచేసినట్లు ఓ అధికారి చెప్పుకొచ్చారు.


**కమిటీలు ఆలస్యం..:** లబ్ధిదారుల ఎంపికలో ఇందిరమ్మ కమిటీల పాత్ర కీలకమనే ప్రచారం జరిగింది. ఒక్కో నియోజకవర్గంలో గ్రామ, మున్సిపాలిటీల్లో వార్డు స్థాయిలో జాబితా సిద్ధం చేసి ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదం పొందాలి. రెండు నెలలుగా దీనిపై కసరత్తు జరిగినా.. ఇప్పటి వరకు మూడు నియోజకవర్గాల జాబితాలే సిద్ధమయ్యాయి. రూరల్‌కు సంబంధించిన జాబితాకు ఆమోద ముద్ర పడింది. కమిటీల్లో స్థానిక పొదుపు సంఘం నుంచి ఇద్దరు మహిళలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గాల నుంచి ఒక్కొక్కరు, మున్సిపాలిటీలో వార్డు అధికారి, పంచాయతీల్లో కార్యదర్శి, కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ కన్వీనర్‌గా, గ్రామాల్లో ఎంపీడీవోలు, ఎంపీవోలు, తహసీల్దార్లు కన్వీనర్లుగా ఉంటారు. కమిటీల బాధ్యతలపై ఇంకా స్పష్టత లేదు. యాప్ ద్వారా ఎంపికలు పూర్తయ్యాక.. గ్రామసభల్లో ఈ కమిటీలు తుది ఆమోదం తెలుపుతాయని చెబుతున్నారు.




అమరావతి: సంక్రాంతి పండుగ రద్దీ నేపథ్యంలో ప్రయాణికుల సౌకర్యార్థం ముఖ్యమంత్రి చంద్రబాబు పలు కీలక సూచనలు చేశారు. ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల బస్సులు తీసుకొని ప్రయాణికులను ప్రధాన పట్టణాల నుంచి పల్లెలకు పంపేందుకు వీలుగా ఏర్పాట్లు చేయాలని ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమల రావు, రవాణా శాఖ అధికారులకు సీఎం ఆదేశాలు జారీ చేశారు. ఫిట్‌నెస్ ఉన్న బస్సులను ఎంపిక చేసి వాటి ద్వారా ప్రజలను సురక్షితంగా గమ్యస్థానాలకు పంపే ఏర్పాట్లు చేయాలని సూచించారు. రద్దీ తీవ్రంగా ఉన్న మార్గాల్లో ఈ తరహా ఏర్పాట్లతో ప్రజలకు కొంత మేర ఇబ్బందుల్లేకుండా ఉంటుందని అభిప్రాయపడ్డారు. సంక్రాంతి పండుగకు తెలంగాణ సహా ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి ఏపీకి పెద్ద ఎత్తున ప్రజలు వస్తున్నారు. ప్రయాణికుల రద్దీతో ఏపీలోని ప్రధాన నగరాలైన విశాఖ, రాజమహేంద్రవరం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం సహా పలు నగరాల్లో బస్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడుతున్నాయి. నగరాలు, పట్టణాల నుంచి సొంత గ్రామాలకు వెళ్లేందుకు వస్తున్న లక్షలాదిమంది ప్రయాణికులకు ఆర్టీసీ బస్సులు సరిపోవడం లేదు. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు అధికారులకు సూచనలు చేశారు.

**ఆ బాధ్యత రవాణా శాఖ అధికారులదే: ఆర్టీసీ ఎండీ...** సీఎం చంద్రబాబు ఆదేశాల నేపథ్యంలో ఆర్టీసీ, రవాణా, పోలీసు శాఖ అధికారులతో సంస్థ ఎండీ ద్వారకా తిరుమల రావు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బస్టాండ్లలో రద్దీపై వారితో చర్చించారు. రద్దీ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. బస్టాండ్లలో ప్రయాణికులు నిరీక్షించకుండా వెంటనే బస్సులు ఏర్పాటు చేయాలన్నారు. ఇందుకోసం అవసరమైన చోట్ల ప్రైవేటు విద్యాసంస్థల బస్సులను తీసుకోవాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేటు విద్యాసంస్థల బస్సుల బాధ్యత రవాణా శాఖ అధికారులదేనని.. కండిషన్‌లో ఉన్న వాటినే తీసుకోవాలని ఆదేశించారు.


# గ్రీన్ ఎనర్జీలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు: చంద్రబాబు



అమరావతి: గ్రీన్ ఎనర్జీ రంగంలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు రానున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. మీడియాతో నిర్వహించిన ఇష్టాగోష్టిలో ఆయన మాట్లాడారు. అనకాపల్లి జిల్లా పూడిమడకలో గ్రీన్ హైడ్రోజన్ ఉత్పత్తి కానుందని తెలిపారు. ఈ హైడ్రోజన్‌తో ఎరువులు, రసాయనాలు తయారవుతాయని పేర్కొన్నారు. హరిత ఇంధనం ద్వారా తయారయ్యే వీటికి విదేశాల్లో మంచి డిమాండ్ ఉందని చెప్పారు. అల్యూమినియం, ఉక్కు ఉత్పత్తికి హైడ్రోజన్ వాడితే వేడి బాగా తగ్గుతుందని వివరించారు. "గ్రీన్‌కో కంపెనీ కాకినాడలో నాగార్జున ఫెర్టిలైజర్స్‌ను టేకోవర్ చేయనుంది. ఇక్కడ గ్రీన్ అమోనియా తయారు చేసి విదేశాలకు ఎగుమతి చేస్తారు. ఈ ప్లాంట్‌పై రూ.25 వేల కోట్ల పెట్టుబడులు పెడుతున్నారు. రిలయన్స్ కంపెనీ బయో కంప్రెస్డ్ గ్యాస్ తయారీకి 500 కేంద్రాలు పెడుతోంది. ఒక్కో కేంద్రానికి రూ.130 కోట్లు పెట్టుబడి పెడుతున్నారు. బయోగ్యాస్‌కు ఉపయోగపడే గడ్డి ద్వారా ఇది తయారవుతుంది. గడ్డి పెంచడానికి ఎకరాకు రూ.30 వేలు కౌలు రైతులకు రిలయన్స్ చెల్లించనుంది. బెంగళూరు సంస్థ స్వాపింగ్ బ్యాటరీల మోడల్‌ను కుప్పానికి తెచ్చింది. సూర్యఘర్ అమలులో ఉన్న ఇళ్ల యజమానులకు స్వాపింగ్ బ్యాటరీల ఛార్జింగ్‌కు డబ్బు చెల్లిస్తారు. దీంతో వారికి అదనపు ఆదాయం చేకూరనుంది. సౌర విద్యుత్ ఉత్పత్తిపై కొత్త ఆలోచనలు చేస్తున్నాం. ఎస్సీ, ఎస్టీలకు ప్రస్తుతం సౌర ఫలకాలు ఉచితంగా ఏర్పాటు చేస్తున్నాం" అని చంద్రబాబు తెలిపారు.

# గ్రీన్‌కో సోలార్ పార్క్‌తో భారీగా ఉపాధి అవకాశాలు: డిప్యూటీ సీఎం పవన్

కర్నూలు: డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శనివారం కర్నూలు జిల్లాలో పర్యటించారు. పిన్నాపురం వద్ద ఏర్పాటైన అతిపెద్ద గ్రీన్‌కో సోలార్ పార్క్, పంప్ స్టోరేజ్ ప్రాజెక్టు సైట్‌ను ఏరియల్ వ్యూ ద్వారా అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం రోడ్డు మార్గంలో ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. "కేంద్రం అనుమతితో 365 హెక్టార్ల అటవీ భూమిని సంస్థ కొనుగోలు చేసింది. అందుకు నెల్లూరులో రూ. 36 కోట్ల విలువైన భూమిని సంస్థ ప్రభుత్వానికి ఇచ్చింది. ఫారెస్టు, రెవెన్యూ మధ్య 45 హెక్టార్ల భూమి వివాదంలో ఉంది. 11.49 ఎకరాలు రైతుల నుంచి గ్రీన్‌కో కంపెనీ తీసుకుంది. గ్రీన్‌కో కంపెనీకి అంతర్జాతీయంగా మంచి పేరుంది. దేశంలో రూ.లక్షన్నర కోట్ల పెట్టుబడి పెడుతోంది. మన రాష్ట్రంలో రూ.35వేల కోట్ల పెట్టుబడి పెడుతున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా భారీగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి. మొత్తం 2,800 ఎకరాల్లో నిర్మిస్తోన్న ప్రాజెక్టు ఇది. ఇలాంటి సమీకృత ప్రాజెక్టు దేశంలో మరోచోట లేదు. ఈ భూమిపై రెవెన్యూ, అటవీశాఖ మధ్య చిన్న వివాదం వచ్చింది. వివాదం పరిష్కరించాలని కేంద్రానికి విన్నవించాం. ఇంత భారీ ప్రాజెక్టును నిర్మిస్తున్నారంటే చాలా ఆనందంగా ఉంది. భవిష్యత్తులో ఈ ప్రాజెక్టు పర్యాటక కేంద్రం కానుంది. కేంద్రం కూడా తగినంత సహకారం అందించాలి. గ్రీన్ కో కంపెనీ పిన్నాపురంలో ఇప్పటికే



రూ.12వేల కోట్ల పెట్టుబడి పెట్టింది. మరో రూ.10వేల కోట్ల పెట్టుబడి పెట్టనుంది. ఈ ప్రాజెక్టు వల్ల జిల్లాకు, రాష్ట్రానికే కాదు.. దేశానికే మంచి పేరు వస్తుంది. సీఎస్ఆర్ కింద పలు కార్యక్రమాలు చేయాలని కోరుతున్నా. పాఠశాలలు, సేంద్రియ సాగు, గోవుల సంతతి పెంచేలా చూడాలి. 50వేల మందికి ఉపాధి కల్పిస్తున్న గ్రీన్ కో కంపెనీకి ధన్యవాదాలు" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

# వారి ఇళ్లకు రేపట్నుంచి వెళ్లనున్న టీటీడీ పాలకమండలి సభ్యులు.. ఎందుకంటే..



తిరుమల: వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల జారీ సందర్భంగా తిరుపతిలో తొక్కిసలాట జరిగి ఆరుగురు మృతిచెందగా.. పలువురు గాయపడిన సంగతి తెలిసిందే. బాధిత కుటుంబాలను ఆదుకునేందుకు టీటీడీ ముందుకొచ్చింది. మృతులకు రూ.25 లక్షల చొప్పున ఇవ్వనున్నట్లు టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ఇప్పటికే ప్రకటించారు. అలాగే తీవ్రంగా గాయపడిన వారికి రూ.5 లక్షలు, స్వల్పంగా గాయపడిన వారికి రూ.2 లక్షలు ఇవ్వాలని తీర్మానం చేశారు. ఈ నగదును స్వయంగా పాలకమండలి సభ్యులే మృతుల కుటుంబసభ్యులకు అందజేయాలని నిర్ణయించారు. అయితే బాధిత కుటుంబాలకు చెక్కులు పంపిణీ చేసేందుకు టీటీడీ పాలకమండలి సభ్యులతో ఛైర్మన్ బీఆర్ నాయుడు కమిటీని ఏర్పాటు చేశారు. వీరంతా తిరుపతి తొక్కిసలాటలో మృతిచెందిన, గాయపడిన వారి ఇళ్లకు స్వయంగా వెళ్లి పరిహారానికి సంబంధించిన చెక్కులు పంపిణీ చేయనున్నారు. ఆదివారం నుంచే ఏపీ సహా పలు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు వెళ్లి కమిటీ సభ్యులు చెక్కులు పంపిణీ చేయనున్నారు. వైజాగ్, నర్సీపట్నం సందర్శించే బృందంలో జోతుల నెహ్రూ, జంగా కృష్ణమూర్తి, పనబాక లక్ష్మి, జానకి దేవి, మహేందర్ రెడ్డి, ఎంఎస్ రాజు, భాను ప్రకాశ్ రెడ్డి ఉండగా.. తమిళనాడు, కేరళను సందర్శించే బృందంలో రామ్మూర్తి, కృష్ణమూర్తి వైద్యనాథన్, నరేశ్ కుమార్,శాంత రామ్, సుచిత్ర ఎల్లా ఉన్నారు. బాధితుల కుటుంబాల ఇళ్లను వీరంతా నేరుగా సందర్శించి స్థానిక శాసనసభ్యులతో కలిసి చెక్కులను అందించనున్నారు. కాగా, ఇప్పటికే స్విమ్స్‌లో చికిత్సపొందుతున్న 37 మంది బాధితుల్లో నిన్న(శుక్రవారం) 32 మందిని వైద్యులు డిశ్ఛార్జ్ చేశారు. వారందరికీ సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు తిరుమల స్వామివారి దర్శనం కల్పించారు. కాగా, ఆదివారం నుంచి వారికి ఆర్థికసాయం చేయనున్నారు. దీంతో వారికి స్వల్ప ఊరట కలిగించే ప్రయత్నం టీటీడీ అధికారులు చేస్తున్నారు.

# వడ్డే ఓబన్న తెలుగువారి కోసం పోరాడారు

అమరావతి: వడ్డె ఓబన్న జయంతి వేడుకలను ఏపీ ప్రభుత్వం నేడు అధికారికంగా జరుపుతోంది. ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి వడ్డె ఓబన్న సన్నిహితుడుగా ఉన్నారు. నల్లమల కేంద్రంగా గెరిల్లా పద్ధతుల్లో బ్రిటీష్ వారిపై ఆయన పోరాటం చేశారు. కర్నూలు శివారులోని జగన్నాథ కొండపై పట్టుబడి 39 ఏళ్లకే వడ్డె ఓబన్న అమరత్వం పొందారు. వడ్డె ఓబన్న జయంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆయన సేవలను గుర్తుచేసుకున్నారు. ఈ మేరకు సోషల్ మీడియా మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్టు చేశారు. వడ్డే ఓబన్న జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. రేనాటి వీరుడు ఓబన్న చరిత్ర నేటి తరాలకు తెలపాలని అన్నారు. బ్రిటిష్ వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలుగువారి ఆత్మగౌరవం నిలపడం కోసం వీరోచితంగా వడ్డే ఓబన్న పోరాడారని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

**ఓబన్న చరిత్ర నేటి తరాలకు తెలియాలి..** "1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటునే ప్రథమ స్వాతంత్ర్య యుద్ధం అంటారు... కానీ అంతకుముందే 1846లో తెలుగునాట ఉయ్యాలవాడ నరసింహ రెడ్డితో కలిసి బ్రిటిష్ వారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా తెలుగువారి ఆత్మగౌరవం నిలపడం కోసం వీరోచితంగా పోరాడారు వడ్డే ఓబన్న. ఆనాటి రేనాటి వీరుడు వడ్డే ఓబన్న చరిత్రను నేటి తరాలకు తెలియజేయాలనే ఉద్దేశంతో ఓబన్న జయంతిని అధికారింగా నిర్వహించేందుకు నిర్ణయించాం. బీసీ ముద్దుబిడ్డ, స్వాతంత్ర్య సమరయోధుడు వడ్డే ఓబన్న జయంతి సందర్భంగా ఆ మహనీయుని వీరగాథను స్మరించుకుందాం" అని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.



# రాష్ట్ర అభివృద్ధిని గవర్నర్ జీర్ణించుకోలేకపోతున్నారు: సీఎం స్టాలిన్

చెన్నై: డీఎంకే నేతృత్వంలోని తమిళనాడు ప్రభుత్వం, గవర్నర్ ఆర్ఎన్ రవికి మధ్య కొంతకాలంగా భేదాభిప్రాయాలు తలెత్తుతున్నాయి. ఈ క్రమంలోనే మరోసారి గవర్నర్‌పై ముఖ్యమంత్రి ఎమ్‌కే. స్టాలిన్ తీవ్ర విమర్శలు గుప్పించారు. రాష్ట్ర అభివృద్ధిని చూసి ఆయన జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ జరిగిన అనంతరం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

"గవర్నర్ అసెంబ్లీకి వచ్చినా ప్రసంగించకుండానే మధ్యలో వెళ్లిపోయారు. ఆయన తీరు చిన్న పిల్లల చేష్టల మాదిరిగా ఉంది. రాజ్యాంగం ప్రకారం గవర్నర్ బాధ్యతను నిర్వర్తించలేకపోయారు. తమిళనాడు అభివృద్ధి చూసి ఆయన జీర్ణించుకోలేకపోతున్నారు" అని సీఎం తీవ్ర విమర్శలు చేశారు. కాగా.. ఇటీవల రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల ప్రారంభోత్సవం సందర్భంగా జాతీయ గీతాన్ని ఆలపించలేదని ఆరోపిస్తూ గవర్నర్ ఆర్ఎన్ రవి.. ప్రసంగం చేయకుండానే వెళ్లిపోయారు. "రాజ్యాంగం, జాతీయ గీతానికి మరోసారి అవమానం జరిగింది. జాతీయ గీతాన్ని గౌరవించడం రాజ్యాంగం ప్రకారం మన ప్రాథమిక విధి. అసెంబ్లీలో చోటు చేసుకున్న పరిణామాలు ఎమర్జెన్సీ రోజులను తలపిస్తున్నాయి" అంటూ ఇటీవల 'ఎక్స్' (ట్విటర్)లో పోస్టు పెట్టారు. ఈ పరిణామంతో అధికార డీఎంకే ప్రభుత్వానికి, గవర్నర్‌కు మధ్య మరోసారి విభేదాలు ఏర్పడ్డాయి. రాష్ట్ర ప్రజలను, ప్రభుత్వాన్ని ఆయన ఎప్పుడూ అవమానిస్తున్నారని ఆరోపించిన సీఎం స్టాలిన్.. గవర్నర్ చర్యపై మరోసారి విమర్శలు చేశారు.




విజయవాడ: తెలుగు ప్రజలందరికీ ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరిలో సంక్రాంతి కొత్త వెలుగులు, ఆనందం నింపాలని ఆకాంక్షించారు. పండగ సమయంలో ఊరెళ్లి అందరితో సంతోషంగా గడపాలని.. అందుకే తాను ప్రతి సంక్రాంతికి ఊరికి వెళ్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. "పండగ సమయంలో ప్రతి ఒక్కరూ తమ ఊరు వెళ్లి నలుగురితో కలవటం అలవాటు చేసుకోవాలి.

అందుకే నేను ప్రతి సంక్రాంతికి మా ఊరికి వెళ్తాను. ఊరు వెళ్లే సంప్రదాయానికి భువనేశ్వరే కారణం. పాతికేళ్ల క్రితం ఆమె పట్టుబట్టి మొదలుపెట్టిన ఈ సంప్రదాయాన్ని క్రమం తప్పకుండా పాటిస్తున్నాం. మానవ సంబంధాలు తగ్గిపోతున్న ఈ రోజుల్లో ఒకచోట అంతా కలవటం, మాట్లాడుకోవడం ఎంతో అవసరం. మనం ఆనందంగా పండగ చేసుకునేటప్పుడు ఊరిలో పేదవారు కూడా ఆనందంగా ఉండేలా చూడాల్సిన బాధ్యత మనపై ఉంది.

వారికి చేయూతనిచ్చి నిలబెట్టాల్సిన బాధ్యత మిగిలినవారిపై ఉంది. ఈ విధానం ప్రోత్సహించడానికే పీ4 కాన్సెప్ట్ పేపర్‌ను ఆదివారం విడుదల చేస్తున్నాం. దీనిపై అన్ని స్థాయిల్లో చర్చ జరిగాక అమల్లోకి తెస్తాం" అని చంద్రబాబు తెలిపారు.

# క్యూఆర్ కోడ్‌తో రేషన్ కార్డు.. రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వ కసరత్తు

## నవ దంపతులకు కొత్త కార్డులు - త్వరలో దరఖాస్తుల స్వీకరణ



అమరావతి: రాష్ట్రంలో నవ దంపతులకు కొత్త రేషన్ కార్డులు ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది.


కార్డుల్లో కుటుంబ సభ్యుల పేర్ల మార్పులు, చేర్పులకూ అవకాశం కల్పించే దిశగా ఆన్‌లైన్ పోర్టల్ తెరవనుంది. దీంతోపాటు రేషన్ కార్డు రూపురేఖల్ని పూర్తిగా మార్చనుంది. క్రెడిట్ కార్డు తరహాలో.. క్యూఆర్ కోడ్‌తో వీటిని జారీ చేయనుంది. ఇప్పటికే దీనికి సంబంధించిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. జనవరి చివరి వారంలో లేదా ఫిబ్రవరి మొదటి వారంలో గానీ ఈ ప్రక్రియ ప్రారంభిస్తామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.

**2 లక్షల మందికి..** రాష్ట్రంలో 1.48 కోట్ల రేషన్ కార్డులు ఉన్నాయి. నవదంపతుల నుంచి అందిన దరఖాస్తులు సుమారు 70 వేలకు పైగా ఉన్నాయి. కుటుంబ సభ్యుల మార్పులు, చేర్పులు కూడా కలిపితే 2 లక్షల రేషన్ కార్డులు ఇవ్వాల్సి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. అంటే రాష్ట్రంలో మొత్తం రేషన్ కార్డులు సుమారు 1.50 కోట్లకు చేరే అవకాశం ఉంది. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన రేషన్ కార్డులు వైకాపా రంగుల్ని పోలి ఉన్నాయి. జగన్ బొమ్మలతో ఇచ్చారు. వాటిని సమూలంగా మార్చివేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. క్రెడిట్ కార్డును పోలి ఉండేలా దీన్ని డిజైన్ చేయించారు. క్యూఆర్ కోడ్ కూడా ఉంటుంది. స్కాన్ చేస్తే కుటుంబ సభ్యుల వివరాలు తెలిసేలా రూపొందించారు. సీఎం చంద్రబాబు ఆమోదం తర్వాత కార్డుల జారీ ప్రక్రియ మొదలవుతుంది. గతేడాది డిసెంబరులోనే కొత్త రేషన్ కార్డుల జారీ ప్రక్రియ ప్రారంభించాలని.. సంక్రాంతికి కొత్త కార్డులు ఇవ్వాలని ప్రాథమికంగా కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అధికారులు రెవెన్యూ సదస్సుల్లో నిమగ్నమవ్వడం, ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతుండడంతో కార్డులకు దరఖాస్తులు తీసుకునే ప్రక్రియను వాయిదా వేశారు. నీ వైకాపా ప్రభుత్వ హయాంలో రేషన్ కార్డుల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. దరఖాస్తు చేసుకున్న వెంటనే కొత్త రేషన్ కార్డు ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించినా.. కొద్ది రోజులకే దాన్ని పక్కన పెట్టారు.

ఆరు నెలలకోసారి ఇస్తామంటూ తిరకాసు పెట్టారు. రాష్ట్రంలో కొత్తగా పెళ్లి చేసుకున్న దంపతులు.. ఏడాదిగా కొత్త రేషన్ కార్డుల కోసం ఎదురు చూస్తున్నారు. కుటుంబ సభ్యుల పేర్ల మార్పులు, చేర్పులకూ అనుమతించలేదు. దీంతో వేలాదిమంది ప్రభుత్వ పథకాలకు అర్హత సాధించలేకపోయారు. ఇదే సమయంలో ఆన్‌లైన్ దరఖాస్తుల విధానాన్ని నిలిపివేశారు. వీటన్నిటికీ పరిష్కారం చూపే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టనుంది.

# రూ.10 లక్షలతో పుస్తకాలు కొన్న పవన్ కల్యాణ్.. ఎందుకంటే

విజయవాడ: రూ.10 లక్షల విలువ చేసే పుస్తకాలను ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కొనుగోలు చేశారు. ఈరోజు(శనివారం) ఉదయం ఇందిరాగాంధీ స్టేడియంలో జరుగుతున్న పుస్తక మహోత్సవానికి పవన్ కల్యాణ్ వచ్చారు. అయితే పవన్ ఇక్కడకు వస్తున్నారని మీడియాకు సమాచారం ఇవ్వకుండా గోప్యంగా అధికారులు ఉంచారు. పుస్తక మహోత్సవం నిర్వాహకులతో పవన్ కల్యాణ్ మాట్లాడారు. తన సొంత డబ్బు రూ.10 లక్షలతో పుస్తకాలకు ఆర్డర్ ఇచ్చారు. పిఠాపురం నియోజకవర్గంలో అధునాతన సౌకర్యాలతో లైబ్రరీ నిర్మాణం ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఆ గ్రంథాలయంలో ఈ పుస్తకాలు ఏర్పాటు చేయాలని పవన్ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. జనవరి 2వ తేదీన పుస్తక మహోత్సవం ప్రారంభించి పుస్తక పఠనం ద్వారా కలిగే ప్రయోజనాలను, వ్యక్తిగతంగా



తనకు కలిగిన మేలును పవన్ కల్యాణ్ వివరించారు. ఇప్పుడు తాను ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో యువతకు పుస్తక పఠనం అలవాటు చేసేలా పవన్ కల్యాణ్ లైబ్రరీ ఏర్పాటు చేయనున్నారు.

## బులుగు సముద్రంలో ఆలియా సాహసాలు చూశారా?

కొత్త సంవత్సరం ప్రారంభం విదేశీ బికినీ బీచ్‌లు ఫుల్ గా రంగులమయం అయ్యాయి. బాలీవుడ్ అందాల భామలు బీచ్ ఇసుకల్లో హద్దులు చెరిపేసి చెలరేగారు. అందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు ఇంటర్నెట్ ని వేడెక్కించాయి. జీవితం ఉన్నది ఒక్కటే.. దానిని తనివితీరా ఆస్వాధించు సోదరా! అని సదరు భామలు ఇచ్చిన స్టేట్ మెంట్ ని ప్రజలు అర్థం చేసుకున్నారు. ఈసారి విదేశీ బీచ్ లను మరిగించిన వారి జాబితాలో ఆలియా భట్ పేరు కూడా ఉంది. పెళ్లయి ఒక బిడ్డకు మామ్ అయిన ఆలియా భట్ తనలో జోరు ఇంకా తగ్గలేదని నిరూపిస్తూ తాజాగా బీచ్ వెకేషన్ లో అడ్వెంచర్స్ చేస్తూ కనిపించింది. స్విమ్ సూట్ లో ఉన్న అలియా భట్ థాయిలాండ్ లో బీచ్ వెకేషన్ మూడ్‌ని ఎక్కడా దాచుకోలేదు. థాయ్‌లాండ్ లో అలియా భట్ కుటుంబ సమేతంగా పర్యటించింది. బీచ్ ఫోటోగ్రాఫ్స్ లో కొన్ని ఫ్రేమ్ లలో అలియా భట్ అందమైన చిరునవ్వుతో మనల్ని పలకరిస్తుంది. ఆలియా నేవీ బ్లూ స్విమ్ సూట్ ధరించి నీటిలో స్విమ్ చేసింది. అలాగే సముద్రం మధ్యలో థ్రిల్లింగ్ స్పీడ్ బోట్ రైడ్ కు



వెళ్లిన ఫోటోలు వైరల్ అయ్యాయి. సోదరి షాహీన్ తో ఆమె ఆన్ పాయింట్ సెల్ఫీ నిజంగా చాలా ప్రత్యేకంగా ఆకర్షించింది. థాయ్ లాండ్ వెకేషన్‌లో తాను బస చేసిన చోట ఆలియా జిమ్ కి వెళ్లింది.. సైక్లింగ్ చేసింది. ఇక ఈ ఫోటోగ్రాఫ్స్ లోనే ఒక స్నాప్‌లో రణబీర్ కపూర్ - అలియా భట్ నుదుటిపై ముద్దు పెట్టుకుని ప్రేమను కురిపించాడు. రాహా అద్భుతమైన హావభావాలతో చుట్టూ వేవ్స్ క్రియేట్ చేసింది. బీచ్ వెకేషన్ లో క్రూయిజ్ రైడ్‌లు, సూర్యాస్తమయాలను ఆస్వాధించడం వగైరా ఎంటర్ టైన్ మెంట్ కు కొదవేమీ లేదు. ఆలియాతో పాటు బ్రహ్మాస్త్ర దర్శకనిర్మాత అయాన్ ముఖర్జీ బ్యూటిఫుల్ లొకేషన్ లో సెల్ఫీ దిగాడు. దానిపై ఆలియా ఆసక్తికర వ్యాఖ్యను షేర్ చేసారు. అలాగే ఆలియా తల్లి సోనీ రజ్దాన్ ప్రయాణ రంగులరాట్నం కూడా ఇంతకుముందు ఫోటో రూపంలో విడుదలైంది. నీతు కపూర్, ఆమె కుమార్తె రిద్ధిమా కపూర్ సాహ్ని, ఆమె భర్త భరత్ సాహ్ని, వారి కుమార్తె సమారా తదితరులు వెకేషన్ లో ఉన్నారు.

అలియా భట్ చివరిసారిగా వాసన్ బాలా దర్శకత్వం వహించిన జిగ్రా చిత్రంలో కనిపించింది. వేదంగ్ రైనా ఇందులో తన సోదరుడిగా నటించాడు. తదుపరి సంజయ్ లీలా భన్సాలీ -లవ్ & వార్ లో రణబీర్ కపూర్‌తో కలిసి ఆలియా నటిస్తోంది. ఈ ప్రాజెక్ట్‌లో విక్కీ కౌశల్ కీలక పాత్ర పోషిస్తున్నారు.

## స్టన్నింగ్ జ్యోతి.. అందమే అసూయ పడేలా..

జగతి మేడమ్.. అలియాస్ జ్యోతి పూర్వాజ్ గురించి తెలుగు బుల్లితెర ఆడియన్స్ లో తెలియని వారుండరని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. హైయెస్ట్ టాప్ రేటింగ్ తో కొన్నాళ్ల పాటు సీరియల్ ప్రపంచాన్ని ఏలిన గుప్పెడంత మనసు ద్వారా తెలుగు ప్రజలకు పరిచయమైంది కన్నడ బ్యూటీ జ్యోతి పూర్వాజ్. సీరియల్ లో జగతి మేడమ్ రోల్ లో కనిపించిన ఆమెకు ఫ్యాన్ బేస్ వేరే లెవెల్ లో ఉందనే చెప్పాలి. తక్కువ టైమ్ లో ఎక్కువ పాపులారిటీ సంపాదించుకున్న జ్యోతి.. అందం, అభినయంతో మెప్పించింది. అటు తల్లి పాత్రలో.. ఇటు టీచర్ రోల్ లో జీవించేసిందని చెప్పడంలో ఆలోచించక్కర్లేదేమో. అయితే సడెన్ గా ఆ సీరియల్ నుంచి తప్పుకున్న.. సినిమాలు, వెబ్ సిరీసులతో ఫుల్ బిజీగా మారిపోయింది. దర్శక నిర్మాత పూర్వాజ్.. ఆమెను సిల్వర్ స్క్రీన్ కు పరిచయం చేశారు! ఆ తర్వాత ఏ మాస్టర్




పీస్ మూవీ టైమ్ లో ప్రేమలో పడ్డి ఇద్దరూ పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. భర్త తీసిన శుక్ర, మాటరాని మౌనమిది చిత్రాల్లో కూడా నటించి మెప్పించింది జ్యోతి. ఇప్పుడు పలు సినిమాలతో బిజీగా ఉన్న అమ్మడు.. సోషల్ మీడియాలో చేసే సందడి మామూలుగా ఉండదు. ఎప్పటికప్పుడు ట్రెండీ డ్రెస్సుల్లో, పొట్టి బట్టల్లో వేరే లెవెల్ లో అందాలు ఆరోబోస్తుంటుంది. అలా రోజురోజుకూ ఫాలోవర్స్ ను పెంచుకుంటున్న ముద్దుగుమ్మ.. తన ఫ్యాన్స్ ను అస్సలు డిస్పాయింట్ చేయదనే చెప్పాలి. తాజాగా కిర్రాక్ పిక్ ను పోస్ట్ చేసిన జ్యోతి.. ఒక్కసారిగా అందరినీ ఫ్లాట్ చేసేసింది. తన గ్లామరస్ లుక్ తో మైండ్ బ్లాక్ చేసిన అమ్మడు.. మైమరపించే పోజు ఇచ్చిందనే చెప్పాలి. సోఫాలో కూర్చున్న బ్యూటీ.. మోడ్రన్ డ్రెస్ లో కనిపించగా.. అంతా ఫిదా. అయితే జ్యోతి అంద చందాలకు ఎవరైనా క్లీన్ బౌల్డ్ అవ్వకుండా ఉండరేమో. ప్రస్తుతం జ్యోతి పిక్ సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో వైరల్ అవుతోంది. బ్యూటిఫుల్ మేడమ్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అందమే అసూయ పడేలా ఉన్నారని చెబుతున్నారు. లైకులు కొడుతూ రచ్చ రచ్చ చేస్తున్నారు. మేడమ్ సర్ మేడమ్ అంతే అంటూ ఆకాశానికెత్తేస్తున్నారు.




# మరక మంచిదే అన్నట్లు వాయిదా కూడా మంచిదేనా!




చాలా సందర్భాల్లో ఆలస్యం అమృతం విషం అంటారు. చేయవలిసిన కార్యాన్ని సకాలంలో పూర్తి చేయకపోతే అది అనర్ధానికి దారి తీస్తుందని అంతా నమ్మే మాట. కానీ ఈ రెండు సినిమాల విషయంలో ఆలస్యం అన్నదే మంచి పనిగా హైలైట్ అవుతోందిప్పుడు. ఇంతకీ ఏంటా కథ అంటే వివరాల్లోకి వెళ్లాల్సిందే. మెగాస్టార్ చిరంజీవి హీరోగా నటిస్తోన్న 'విశ్వంభర' చిత్రాన్ని సంక్రాంతి కానుకగా రిలీజ్ చేయాలనుకున్న సంగతి తెలిసిందే. కానీ అదే సమయంలో తనయుడు రామ్ చరణ్ నటించిన 'గేమ్ ఛేంజర్' కూడా ఉండటంతో? తండ్రి వెనక్కి తగ్గినట్లు వెలగులోకి వచ్చింది. ఇందులో కొంత వాస్తవం ఉంది. కానీ అసలు సంగతేంటి? అంటే %-%విశ్వంభర%-% సోషియా ఫాంటసీ కావడంతో సీజీ వర్క్ ఎక్కువగా ఉంది. ఆ పనులన్నీ కూడా సంక్రాంతికి పూర్తి చేసి రిలీజ్ చేయాలి. అయితే అప్పటికే షూట్ పూర్తయినంత వరకూ పోస్ట్ ప్రొడక్షన్ జరుగుతున్నా? పూర్తయిన వరకూ పెద్దగా పర్ఫెక్షన్ రాలేదుట. దీంతో మళ్లీ అవసరమైన చోట రీవర్క్ కి చేసారుట. నిజంగా సంక్రాంతికి రిలీజ్ టార్గెట్ గా పెట్టుకుంటే గనుక ఆ పనంతా గందరగోళం, హైరనాగానే జరిగేదని తాజాగా వెలుగులోకి వస్తోంది. సీజీ వర్క్ ఉన్న సినిమాల విషయంలో ఎంత వీలైంత అంత సమయం తీసుకుని కూల్ గా పనిచేయాలి తప్ప కంగారు పనిచేస్తే క్వాలిటీ ప్రోడక్ట్ అందించ లేము అన్నది తెలిసిందే. లక్కీగా గేమ్ ఛేంజర్ సంక్రాంతి బరిలోకి రావడంతో? దర్శకుడు వశిష్ట వెనక్కి తగ్గి కూల్గా పోస్ట్ ప్రొడక్షన్ చేసి రిలీజ్ చేస్తే మంచిదని భావించి సమ్మర్ కి వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ధనుష్, నాగార్జున హీరోలగా నటిస్తోన్న 'కుబేర' చిత్రాన్ని కూడా సంక్రాంతికే రిలీజ్ చేయాలనుకున్నారు. ఆ దిశగా పనులు కూడా ప్రారంభించారు. కానీ కొంత వర్క్ జరిగిన తర్వాత శేఖర్ కమ్ములా ఎందుకు తొందర పడటం అని ఆలోచించుకుని వెనక్కి తగ్గారుట. ఆ తేదీ కాకపోతే మరో తేదీ కూల్ గా రిలీజ్ చేద్దామని నిర్మాతలు కూడా భరోసా ఇవ్వడంతో కుభేర కూడా ఎగ్జిట్ అయినట్లు వెలుగులోకి వస్తోంది.

ఇక్కడ మరో విషయం కూడా గుర్తిచాలి. ఒకేసారి నాలుగు సినిమాలు రిలీజ్ చేసి టికెట్ ధరలు ఆకాశాన్నంటేలా పెట్టేస్తే విమర్శలు తప్పవు. అలా కాకుండా గ్యాప్ తీసుకుని రిలీజ్ చేస్తే ఆ రకమైన ఇబ్బంది ఉండదు అన్నది కమ్ములా నిర్మాతల ఆలోచనగా వెలుగులోకి వస్తోంది. మొత్తానికి అప్పుడప్పుడు ఇలా వాయిదా వేయడం కూడా మంచిదేనని అర్దమవుతుంది.

## దేవర-2 అవసరమా అంటూ క్వశ్చన్లు.. మేకర్స్ మాత్రం కష్టపడాల్సిందే..




టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్, మాస్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్ లో గతేడాది దేవర పార్ట్-1 ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ గా యాక్ట్ చేసిన ఆ సినిమాలో సైఫ్ అలీ ఖాన్ విలన్ గా నటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించగా.. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లు ప్రొడ్యూస్ చేశాయి. అయితే బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.500 కోట్లను వసూలు చేసి క్లీన్ హిట్ గా నిలిచింది దేవర. కానీ బెనిఫిట్ షో తర్వాత నెగిటివిటీ అందుకుంది. ఆ తర్వాత మాస్ ఆడియన్స్ కనెక్ట్ కావడంతో నెగిటివిటీ అధిగమించి మంచి విజయం సాధించిందనే చెప్పాలి. అదే సమయంలో సినీ ప్రియులను అంచనాలు మాత్రం అందుకోలేదని కొందరు అభిప్రాయపడ్డారు.

ఓటీటీలోకి వచ్చాక మూవీపై ఫుల్ ట్రోల్స్ వచ్చాయని చెప్పాలి. ఎక్కడా ఏ మిస్టేక్ జరిగిందో క్లియర్ గా ఐడెంటిఫై చేసిన సినీ ప్రియులు.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. కొందరు బ్యాడ్ రివ్యూస్ కూడా ఇచ్చారు. సినిమాకు సీక్వెల్ అవసరం లేదని మరికొందరు అభిప్రాయపడ్డారు. దీంతో సీక్వెల్ రద్దు అయిందని ఆ మధ్య ఊహాగానాలు వచ్చాయి. అయితే ప్రస్తుతం దేవర-2 స్క్రిప్ట్ వర్క్ ను చేస్తున్నారు కొరటాల శివ. తన పవర్ ఏంటో చూపించాలని ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. పార్ట్ 2 మూవీలో యాక్షన్ తక్కువ, ఎమోషన్స్ ఎక్కువగా ఉండేలా స్క్రిప్ట్ రెడీ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. 2025 జూలై నుంచి సెట్స్ మీదకు సినిమాకు తీసుకెళ్లి, 2026లో రిలీజ్ చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో ఇప్పటికీ కొందరు సీక్వెల్ నిజంగా అవసరమా అని అని క్వశ్చన్ చేస్తున్నారు. పార్ట్-2 చాలా బాగుంటుందని ఇప్పటికే మేకర్స్ చెప్పినప్పటికీ.. తమకు ఇంట్రెస్ట్ లేదని అంటున్నారు. టైం వేస్ట్ అని.. ఇప్పటికే ఫస్ట్ పార్ట్ కోసం రెండేళ్లు వృథా చేశారని ఆరోపిస్తున్నారు. దీంతో వాళ్లకు సీక్వెల్ నచ్చాలంటే కొరటాల శివ బాగా కష్టపడాల్సిందే. తొలి భాగంలో జాన్వీ తన యాక్టింగ్ తో చాలా ట్రోల్స్ ఎదుర్కొన్నారు. ఆమె రోల్ కు స్కోప్ లేదని అన్నారు. రెండు పేజీల డైలాగ్ అంటూ ప్రమోషన్స్ లో చెప్పినది ఎక్కడుందని అప్పట్లో కామెంట్లు పెట్టారు. దీంతో హీరోయిన్ విషయంతోపాటు అన్ని విషయాల్లో మేకర్స్ తమ వర్క్ తో మెప్పించాలి. అప్పుడే సీక్వెల్.. ఫస్ట్ పార్ట్ కన్నా హిట్ అయ్యే ఛాన్స్ ఉంది. మరేం జరుగుతుందో వేచి చూడాలి.

## బాలకృష్ణ నా లక్కీఛార్మ్ అనేసిన ప్రగ్యాజైశ్వాల్!

ముంబై బ్యూటీ ప్రగ్యాజైశ్వాల్ తెలుగులో ఇప్పటికే చాలా సినిమాలు చేసింది. కానీ ఎన్ని సినిమాలు చేసినా నటసింహ బాలకృష్ణ సరసన నటించిన అఖండతో మాత్రం బాగా ఫేమస్ అయింది. తెలుగులో అమ్మడి క్రేజ్ పెరగడానికి కారణం బాలయ్య ఇమేజ్ అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అమ్మడి పాపులారిటీ రెట్టింపు అయింది బాలయ్య అభిమానుల వల్లే. సంక్రాంతికి రిలీజ్ అవుతున్న డాకు మహారాజ్ లోనూ నటించింది. అఖండ తాండవంలో కూడా హీరోయిన్ గా ఎంపికైంది ప్రగ్యా. ఈ నేపథ్యంలో ఇటీవలే బాలయ్య కారణంగానే అవకాశాలు వస్తున్నాయనే ప్రశ్న ఆమె ముందుకు వెళ్లడంతో ఆయన తనకు ఎలాంటి రికమండేషన్లు ఇవ్వలేదని కూడా కుండ బద్దలు కొట్టేసింది. డాకు మహారాజ్ లో ఛాన్స్ కి కారణం



దర్శకుడు బాబి అంది. కథలే తన దగ్గరకు వస్తునాయని..తాను వాటి దగ్గరకు వెళ్లడం లేదని తెలిపింది. ఈ నేపథ్యంలో తాజాగా బాలయ్య నా లక్కి ఛార్మ్ అంటూ ట్విస్ట్ ఇచ్చింది. బాలయ్యతో వరుసగా కలిసి పనిచేయడం ఓ గొప్ప అవకాశంగా భావిస్తుంది. అఖండ చిత్రం రాత్రికి రాత్రే తన రాతను మార్చేసిందంది. కోవిడ్ సమయంలో బోయపాటి పిలిచి ఇచ్చిన అవకాశంగా పేర్కొంది. ఆయన నుంచి పిలుపు రాగానే ముంబై నుంచి హ్యాండ్ బ్యాగ్ తో హైదరాబాద్ లో దిగిపోయానంది. కథ చెప్పిన గంటలోపే ప్రాజెక్ట్ ఖరారైందట. ఇప్పుడు అఖండ -2లోనూ తనని భాగం చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేసింది. ఇక బాలయ్యని బాలఅని ముద్దుగా పిలిచే హీరోయిన్లలో ప్రగ్యాజైశ్వాల్ కూడా ఉంది. ఆయన్ని సర్ అని పిలవడం ఇష్టం ఉండదని ఇటీవలే శ్రద్దా శ్రీనాధ్ ఓ ఇంటర్వ్యూలో రివీల్ చేసిన సంగతి తెలిసిందే. సర్ అని పిలవడం కంటే బాల అంటేనే ఆయన ఎంతో సంతోషంగా ఫీలవుతారని తెలిపింది. ప్రగ్యాజైశ్వాల్ కూడా ఇదే విషయాన్ని గతంలో ఓ సందర్భంలో రివీల్ చేసింది.

## చీరకట్టులో అందాల రాక్షసి వయ్యారాలు.. వ్వాటే లుక్స్!

'అందాల రాక్షసి' సినిమాతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న లావణ్య, తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె కెరీర్ ప్రారంభంలోనే వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించడంలో సక్సెస్ అయ్యారు. ఇక తాజాగా తన ట్రెడిషనల్ లుక్‌తో మళ్లీ సోషల్ మీడియాలో హీటెక్కించిన విధానం వైరల్ అవుతోంది. పీచ్ కలర్ చీరలో మెల్లగా మెరిసిపోతూ కనిపించిన లావణ్య ఫోటోస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చీరకట్టులో ఆమె అందం అభిమానులను ఆకర్షిస్తోంది. ఈ లుక్‌లో సింప్లిసిటీకి గ్లామర్ జోడించి తనదైన స్టైల్‌ను చూపించారు. లావణ్య త్రిపాఠి తన డ్రెస్సింగ్ చాయిస్‌తో ఎల్లప్పుడూ ప్రత్యేకమై నిలుస్తారు, ఈ సారి కూడా అదే ప్రూవ్ అయ్యింది. మెకప్ చాలా సాఫ్ట్‌గా ఉండగా, ఆమె సొగసైన జడ ధరించిన చెవిపోగులు, హుందాతనానికి



తార్కాణంగా నిలిచాయి. అవకాశాలు తగ్గినా, సోషల్ మీడియాలో మాత్రం ఆమె క్రేజ్ తగ్గడం లేదు. ఇన్‌స్టాగ్రామ్‌లో లావణ్య తరచుగా తన అందాలను మెరిపిస్తూ, ఫ్యాన్స్‌ను కనువిందు చేస్తుంటారు. ఇటీవలనే ఆమె మెగా ఫ్యామిలీ కోడలిగా మారి కొత్త జీవితంలో అడుగు పెట్టారు. ప్రొఫెషనల్ లైఫ్‌ను, పర్సనల్ లైఫ్‌ను సమన్వయం చేస్తూ కెరీర్‌లో మరో హిట్ కోసం సిద్ధమవుతున్నారు. ఆమె గత చిత్రాల విషయానికి వస్తే, 'మిస్టర్,' 'సోగ్గాడే చిన్ని నాయన,' 'భలే భలే మగాడివోయ్' వంటి బ్లాక్ బస్టర్స్ ఆమె కెరీర్‌కు మంచి బూస్ట్ ఇచ్చాయి. ప్రస్తుతం 'సతీ లీలావతి' అనే ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా ఆమెకు మరింత గుర్తింపు తీసుకొస్తుందని సినీ వర్గాలు ఆశిస్తున్నాయి. టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను నిలబెట్టుకున్న లావణ్య, పలు భాషల్లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ట్రెడిషనల్ లుక్‌తో అలా మెరిసిపోయిన ఈ ఫోటోలు, మరోసారి ఆమె తన అందాన్ని ఎలా ప్రదర్శించాలో చూపిస్తున్నాయి. 'సతీ లీలావతి'తో మరోసారి ప్రేక్షకులను మెప్పించే పనిలో ఉన్న లావణ్య త్రిపాఠి, ఫ్యాన్స్‌ను మరింతగా ఆకట్టుకుంటారనే ఆశాభావం ఉంది. చూడాలి మరి అమ్మడు ఎంతవరకు సక్సెస్ అందుకుంటుందో.



# తెలంగాణకు రేవంత్ గుడ్ న్యూస్: నెలాఖరుకల్లా శంకుస్థాపన

హైదరాబాద్‌లో కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవన నిర్మాణానికి శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ నెలాఖరు నాటికి శంకుస్థాపనం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం సంకల్పించింది. ఈ అసుపత్రి ద్వారా పేద ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలను అందించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. గోషామహల్ పోలీస్ స్టేడియం స్థలంలో ఈ ఆసుపత్రి నిర్మితం కాబోతోంది. దీనికి సంబంధించిన ప్రణాళికలపై రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు.

ఆయన నివాసంలో ఈ సమావేశం ఏర్పాటైంది. వైద్య ఆరోగ్య మంత్రిత్వ శాఖ ముఖ్య కార్యదర్శి క్రిస్టినా జెడ్ ఛొంగ్తు, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్.. ఇతర ఉన్నతాధికారులు ఇందులో పాల్గొన్నారు. ఆసుపత్రి నిర్మాణానికి ఈ నెలాఖరులోగా శంకుస్థాపన చేయడానికి వీలుగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి అధికారులకు సూచించారు. గోషామహల్ పోలీస్ స్టేడియంలో ప్రతిపాదిత స్థలానికి సంబంధించిన సమగ్ర వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ శాఖ పరిధిలో ఉన్న ఆ స్థలాన్ని వీలైనంత త్వరగా వైద్య, ఆరోగ్య శాఖకు బదిలీ చేయాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు. రెండు శాఖల మధ్య భూ బదలాయింపు ప్రక్రియ, ఇతర పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు. ప్రతిపాదిత స్థలంలో చేపట్టాల్సిన నిర్మాణాలకు సంబంధించిన నమూనా మ్యాప్‌లను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ మ్యాప్‌లల్లో రేవంత్ రెడ్డి పలు మార్పులు, చేర్పులను సూచించారు. అన్ని రకాల ఆధునిక వసతులతో ఉండేలా ఆసుపత్రి నిర్మాణం ఉండాలని చెప్పారు. ముఖ్యంగా రోడ్లు, పార్కింగ్, మార్చురీ, ఇతర మౌలిక సదుపాయాల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని నమూనాలను రూపొందించాలని సూచించారు. భవిష్యత్తులో రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ లాంటి నిర్మాణాలు చేపట్టినా ఇబ్బందులు తలెత్తకుండా ఉండేలా ముందుచూపుతో డిజైన్లను రూపొందించాలని చెప్పారు. అత్యాధునిక వసతులతో పాటు రోగుల సహాయకులు సేద తీరడానికి వీలుగా గ్రీనరీ, పార్క్ లాంటి సదుపాయాలు ఉండేలా చూడాలని అన్నారు. కార్పోరేట్ ఆసుపత్రులకు ధీటుగా అత్యాధునిక వసతులతో ఆసుపత్రి నిర్మాణం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని రేవంత్ రెడ్డి సూచించారు. కొత్త ఉస్మానియా ఆసుపత్రి భవనాలు, ఇతర నమూనాలకు సంబంధించి పూర్తిస్థాయి డిజైన్లను రూపొందించాలని, ఈ నెలాఖరులో శంకుస్థాపన చేసేందుకు వీలుగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.



# రైల్వే స్టేషన్‌లో కూలిన పైకప్పు..

కన్నౌజ్: ఉత్తరప్రదేశ్‌లో ప్రమాదం జరిగింది. కన్నౌజ్ రైల్వే స్టేషన్‌లో నిర్మాణంలో ఉన్న భవనం పైకప్పు ప్రమాదవశాత్తూ కూలిపోయింది. దీంతో పలువురు కార్మికులు శిథిలాల కింద చిక్కుకుపోయారు. సమాచారమందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

శిథిలాల కింద కనీసం 20 మంది చిక్కుకుని ఉండొచ్చని ప్రాథమిక సమాచారం. ఇప్పటివరకు ఆరుగురిని కాపాడి ఆసుపత్రికి తరలించారు. శిథిలాల కింద వారిని వెలికి తీసేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. యూపీలోని కన్నౌజ్ రైల్వే స్టేషన్‌లో ఆధునికీకరణ పనుల్లో భాగంగా పలు నిర్మాణాలు చేపట్టారు. ఈ క్రమంలోనే శనివారం మధ్యాహ్నం రెండో అంతస్తులో ఉన్న పైకప్పు ఒక్కసారిగా కూలిపోయింది. భారీ శబ్దం రావడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు. దీనిపై మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. క్షతగాత్రులకు తక్షణమే మెరుగైన వైద్య సాయం అందించాలని సూచించారు.



# స్వగ్రామాలకు కదిలిన నగరవాసులు
## మెట్రో రైళ్లలో కిటకిట

హైదరాబాద్: సంక్రాంతి పండగ నేపథ్యంలో హైదరాబాద్ నగరవాసులు స్వగ్రామాలకు బయలుదేరారు. నేటి నుంచి వరుస సెలవులు ఉండటంతో సొంతూళ్లకు తరలివెళ్తున్నారు. పండగకు వెళ్లే వారితో మెట్రో రైళ్లలో రద్దీ నెలకొంది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి ఎల్బీనగర్, మియాపూర్, సికింద్రాబాద్, ఎంజీబీఎస్, జేబీఎస్ తదితర ప్రాంతాలకు చేరుకునేందుకు మెట్రో రైళ్లలో ప్రయాణిస్తున్నారు. మియాపూర్, రాయదుర్గం, జేఎన్టీయూ, అమీర్‌పేట్, ఎంజీబీఎస్, పరేడ్ గ్రౌండ్స్, సికింద్రాబాద్, ఎల్బీనగర్, ఉప్పల్ తదితర స్టేషన్ల వద్ద రద్దీ నెలకొంది.



# కొండపోచమ్మ సాగర్ డ్యామ్‌లో పడి
## ఐదుగురు హైదరాబాద్ యువకులు మృతి

సిద్దిపేట: సిద్దిపేట జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మార్కూర్ మండలంలోని కొండపోచమ్మ సాగర్ డ్యామ్‌లో పడి హైదరాబాద్‌కు చెందిన ఐదుగురు యువకులు ప్రాణాలు కోల్పోయారు. నగరానికి చెందిన ఏడుగురు యువకులు శనివారం కొండపోచమ్మ సాగర్‌కు ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు వారిలో ఐదుగురు యువకులు నీటిలో మునిగి ప్రాణాలు కోల్పోయారు. మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు.

సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని ఘటనపై ఆరా తీశారు. మృతులు హైదరాబాద్‌కు చెందిన ధనుష్ (20), లోహిత్ (17), దినేశ్వర్ (17), జతిన్ (17), శ్రీనివాస్ (17)గా గుర్తించారు. మృతదేహాలను స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



# నన్ను క్షమించండి!
# తెలంగాణ ప్రజలకు దిల్ రాజు క్షమాపణ

హైదరాబాద్: తెలంగాణ ప్రజలకు నిర్మాత దిల్ రాజు క్షమాపణలు చెప్పారు. 'సంక్రాంతికి వస్తున్నాం' ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో ఆయన చేసిన వ్యాఖ్యలు వైరల్‌గా మారిన నేపథ్యంలో తాజాగా క్లారిటీ ఇచ్చారు. రాష్ట్ర ప్రజలకు క్షమాపణలు చెప్పారు. "నిజామాబాద్ జిల్లా వాసిగా నా సినిమా ఈవెంట్ అక్కడ చేశా. ఆ ఈవెంట్‌లో నేను మన సంస్కృతిలో ఉండే దావత్ గురించి మాట్లాడాను. తెలంగాణ వాళ్లను నేను అవమానించానని, హేళన చేశానని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. తెలంగాణ సంస్కృతిని నేను అభిమానిస్తాను. బాన్సువాడలోనే 'ఫిదా' చిత్రాన్ని తెరకెక్కించాం. ఆ సినిమా తెలంగాణ సంస్కృతిని ప్రపంచవ్యాప్తం చేసింది. 'బలగం' చిత్రాన్ని తెలంగాణ సమాజం మొత్తం ఆదరించింది. అన్ని రాజకీయ పార్టీలు 'బలగం' చిత్రాన్ని అభినందించాయి. తెలంగాణ వాసిగా నేను ఏవిధంగా ఈ రాష్ట్రాన్ని హేళన చేస్తాను" అని పేర్కొన్నారు.

# ఆ తర్వాతే మంత్రివర్గ విస్తరణ




హైదరాబాద్, జనవరి 11: తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కీలక కామెంట్స్ చేశారు. మంత్రి వర్గ ఎప్పుడు ఉంటోందో తేల్చిచెప్పారు. అలాగే కాంగ్రెస్‌లో చేరికలు కూడా జోరుగా ఉంటాయన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థులకు సంబంధించి ప్రకటన ఉంటుందని తెలిపారు పీసీసీ చీఫ్. శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ మాట్లాడుతూ.. సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణ చేస్తామని ప్రకటించారు. అలాగే బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో సంప్రదింపులు చేస్తున్నామని.. సంకాంత్రి తర్వాత చేరికలు ఉంటాయని వెల్లడించారు. టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో మిత్ర పక్షాలకు మద్దతు ఇస్తామన్నారన్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిని రెండు, మూడు రోజుల్లో ప్రకటిస్తామని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నాలుగు పేర్లు పరిశీలనలో ఉన్నాయని చెప్పారు. అల్ఫోర్స్ నరేందర్ రెడ్డి, ప్రసన్న హరికృష్ణ, మాజీ అధికారి గంగాధర్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు వెల్లడించారు. వచ్చే 20 ఏండ్లను దృష్టిలో పెట్టుకుని పనిచేయాలని హైకమాండ్ గట్టి వార్నింగ్ ఇచ్చిందని తెలిపారు. ఈ నెల చివరి నాటికి పార్టీలో అన్ని కమిటీలను నియమిస్తామని తెలిపారు. కార్పోరేషన్ పదవుల భర్తీ నెలలోపు అయిపోతుందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. కాగా.. గత కొద్దినెలలుగా తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. గత ఏడాది డిసెంబర్‌లోనే మంత్రి వర్గ విస్తరణ ఉంటుందని అంతా భావించారు. ఈ మేరకు తెలంగాణ కాంగ్రెస్ నేతలు ఢిల్లీకి వెళ్లి హైకమాండ్ పెద్దలతో చర్చలు కూడా జరిపారు. డిసెంబర్‌లోనే మంత్రి వర్గ విస్తరణ ఖాయమని అప్పట్లో మంత్రులు కూడా ప్రకటనలు చేశారు. అయితే కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విదేశీ పర్యటనలో ఉండగా.. ఈ నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సులో పాల్గొనేందుకు దావోస్‌కు వెళ్లనున్నారు. ఈ క్రమంలో రేవంత్ పర్యటన నేపథ్యంలో కేబినెట్ విస్తరణ మరింత ఆలస్యం కానుందని కాంగ్రెస్ వర్గాలే చెప్పుకొచ్చారు. ఇప్పుడు అనూహ్యంగా టీపీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ స్వయంగా మంత్రి వర్గ విస్తరణపై ప్రకటన చేయడం చర్చనీయాంశంగా మారింది.



# సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో 3 రోజుల పాటు కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్

హైదరాబాద్: సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో జనవరి 13 నుంచి 15 వరకు కైట్ అండ్ స్వీట్ ఫెస్టివల్ నిర్వహించనున్నట్టు మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్వీట్ ఫెస్టివల్ పోస్టర్‌ను మంత్రి విడుద చేశారు. "వివిధ రాష్ట్రాలకు చెందినవారు స్వీట్ ఫెస్టివల్‌లో పాల్గొంటారు. ఇండోనేషియా, శ్రీలంక, కాంబోడియా, స్కాట్‌లాండ్, మలేసియా, ఇటలీ, దక్షిణాఫ్రికా, నెదర్లాండ్స్ సహా మొత్తం 50 దేశాలకు చెందిన దాదాపు 150 మంది ఫ్లయర్స్ కైట్ ఫెస్టివల్‌లో పాల్గొంటారు. ఈ మూడు రోజులు ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి.. ఎవరైనా పాల్గొనవచ్చు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా ఫెస్టివల్ ఉంటుంది. సంస్కృతిలో భాగమే ఈ పండుగలు. గ్రామాల్లో కూడా సంస్కృతి, సంప్రదాయాలు పెంపొందించేలా పెద్ద ఎత్తున ఇలాంటి కార్యక్రమాలు చేసుకోవాలి. తెలంగాణలోని ప్రాచీన కట్టడాలు, దేవాలయాలను పర్యటించాలి. తెలంగాణ టూరిజం అందుకు తోడ్పాటు అందిస్తుంది" అని మంత్రి జూపల్లి తెలిపారు.

# భువనగిరి భారాస కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణుల దాడి



భువనగిరి: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై భారాస భువనగిరి జిల్లా అధ్యక్షుడు కంచెల రామకృష్ణారెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ భువనగిరిలోని భారాస కార్యాలయంపై కాంగ్రెస్ శ్రేణులు దాడికి పాల్పడ్డాయి. కంచెల రామకృష్ణారెడ్డి భువనగిరిలో శనివారం మీడియాతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని కాంగ్రెస్ కార్యకర్తలు ఆరోపించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పట్ల ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని యువజన కాంగ్రెస్ కార్యకర్తలు నిరసన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో భారాస కార్యాలయంపై దాడి చేసి కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. అనంతరం కార్యాలయం ముందు బైఠాయించి నిరసన తెలిపారు.

# బీజేపీపై ఓ రేంజ్‌లో ఫైర్ అయిన షర్మిల

విజయవాడ, జనవరి 11: బీజేపీపై ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దర్యాప్తు సంస్థలను బీజేపీ గుప్పిట్లో పెట్టుకుంటోందని ఆరోపించారు. అలాగే దేశంలో కాషాయమయం చేసేలే కుట్రలు చేస్తోందని.. చర్చిలు, మసీదులపై దాడులు చేయడం బీజేపీకి అలవాటుగా మారోయిందని మండిపడ్డారు. బీజేపీ దళితులంటే చిన్నచూపన్నారు. రాజ్యాంగ నిర్మత డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను కమలంపార్టీ అవమాన పాలు చేసిందని విమర్శించారు. శనివారం షర్మిల మీడియాతో మాట్లాడుతూ.. మతం, కులం పేరుతో బీజేపీ దేశంలో రాజకీయాలు చేస్తుందని వ్యాఖ్యలు చేశారు. సీబీఐ, ఈడీ వంటి అన్ని ప్రభుత్వ వ్యవస్థలను తమ గుప్పిట్లో పెట్టుకున్నారని.. ఆ వ్యవస్థ లను వారి స్వార్థం కోసం దుర్వినియోగం చేస్తున్నారని దుయ్యబట్టారు. దేశం మొత్తాన్ని కాషాయ మయం చేసే కుట్రలు చేస్తున్నారన్నారు. ఫాదర్ ఆఫ్ ది నేషన్ మహాత్మాగాంధీని బీజేపీ విలన్‌గా చిత్రీకరించిందని తెలిపారు. ఆయన్ను చంపిన వారిని హీరోగా ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అహింసా మార్గానికి భిన్నంగా హింసా మార్గం వైపు బీజేపీ పాలన సాగుతుందన్నారు. చర్చిలు, మసీదులపై దాడులు చేయడం బీజేపీకి అలవాటుగా మారిందని అన్నారు. అంబేద్కర్‌ను కూడా వదలకుండా అసత్యాలు ప్రచారం చేస్తున్నారన్నారు. సమాజంలో జస్టిస్, సమానత్వం ఉందంటే అంబేద్కర్ రాజ్యాంగం కారణమని చెప్పుకొచ్చారు. ఆయన్ను కూడా పార్లమెంటులో ఎంత హేళన చేశారో చూశామన్నారు. దళితులు అంటేనే చిన్న చూపు బీజేపీకి అని విమర్శించారు. కుల గణన విషయంలో కూడా బీజేపీ ప్రజలను మోసం చేసిందన్నారు. రాజ్యాంగాన్ని అమలు చేయాలనే కాంగ్రెస్ పోరాటం చేస్తుందని తెలిపారు. ఏపీలో బీజేపీ అంటే బాబు, జగన్, పవన్ అనేది తేలిపోయిందన్నారు. బీజేపీ రాష్ట్రానికి ఎంత అన్యాయం చేసినా వీరి ముగ్గురు మాట్లాడరన్నారు. అంబేద్కర్‌ను అవమానించిన బీజేపీ క్షమాపణ చెప్పాల్సిందే అని వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు.

# టోల్‌గేట్ల వద్ద రద్దీ లేకుండా పోలీసుల ముందస్తు చర్యలు

హైదరాబాద్: సంక్రాంతి పండగ సందర్భంగా నగరవాసులు వాహనాల్లో సొంతూళ్లకు క్యూకట్టారు. దీంతో పెద్ద సంఖ్యలో వాహనాలు రోడ్డెక్కడంతో ఆయా ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ నెలకొంది. టోల్‌గేట్ల వద్ద కిలోమీటర్ల మేర వాహనాలు బారులు తీరుతున్నాయి. దీంతో టోల్‌గేట్ల వద్ద రద్దీ లేకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వాహనాలను దారి మళ్లిస్తున్నారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఆధ్వర్యంలో పండగ రద్దీ నివారణకు చర్యలు తీసుకుంటున్నారు



Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com